
## ఆమె నవ్వుకు రూ.16.5 కోట్లు




2


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - శుక్రవారం 1 ఆగస్టు 2025 | సంపుటి:9 | సంచిక:215 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


## తిరుమలలో రీల్స్ చేస్తే కఠిన చర్యలు



హెచ్చరించిన టీటీడీ అధికారులు

2

# పరామర్శలా.. బలప్రదర్శనలా?

## మహిళా ఎమ్మెల్యేను దుర్భాషలాడితే పరామర్శలా

ఇదెక్కడి రాజకీయ నీతి జగన్ • మండిపడ్డ హోంమంత్రి అనిత



2



# రేపట్నుంచి అన్నదాత సుఖీభవ

## దర్శిలో ప్రారంభించనున్న సీఎం • అధికారులతో సమీక్షించిన చంద్రబాబు

**అమరావతి:** రాష్ట్ర రైతాంగానికి ఇచ్చిన హామీ మేరకు 'అన్నదాత సుఖీభవ' పథకం అమలు చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందడుగు వేసింది. ఈ నేపథ్యంలోనే గురువారం నాడు అన్నదాత సుఖీభవ పథకం అమలుపై సంబంధిత అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఆగస్టు 2వ తేదీన 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధం అవుతుంది. ఆగస్టు 2న ప్రకాశం జిల్లా దర్శిలో 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. అదే రోజున పీఎం కిసాన్ పథకం నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయనుంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.6,000 సాయంతో కలిపి రాష్ట్ర వాటాగా మరో రూ.14,000 కూటమి ప్రభుత్వం ఇవ్వనుంది. అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి రైతుకు రూ.20,000 నగదును 3 విడతలుగా ప్రభుత్వం ఇవ్వనుంది. మొదటి విడతలో రాష్ట్రం వాటా రూ.5,000.. కేంద్రం వాటా రూ.2,000 చొప్పున ఆగస్టు 2న విడుదల చేయనున్నారు. రాష్ట్రంలోని 46,85,838 మంది రైతులకు 'అన్నదాత సుఖీభవ'తో లబ్ధి చేకూరనుంది. ఇందుకోసం రూ.2,342.92 కోట్ల

...మిగతా 2లో

## లిక్కర్ స్కామ్‌లో పెట్టెలే దొరికాయి.. కంటైనర్లు దొరకాల్సి ఉంది

**అమరావతి, (మనం న్యూస్):** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై మాజీ మంత్రి, టీడీపీ ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు మండిపడ్డారు. గురువారం అమరావతిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. నిన్ను చూసి ఎవరు భయపడడం లేదు జగన్ రెడ్డి.. శాసనసభను చూసి నువ్వే భయపడుతున్నావంటూ ఎద్దేవా చేశారు. టెన్త్ క్లాస్ పేపర్లు కొట్టేసింది ఎవరో నీ స్నేహితుల్ని ఎవరిని అడిగినా చెప్తారన్నారు. చంద్రబాబు.. పెద్దిరెడ్డి గురించి జగన్ మాట్లాడిన మాటలు అబద్ధమని ఈ సందర్భంగా ఆయన బయటపెట్టారు.నాటి సంఘటనలను వివరిస్తూ ఉన్న వీడియోను ఈ సందర్భంగా

...మిగతా 2లో

## బాబు కాదు..నీవే బావిలో దూకాలి

### జగన్ వ్యాఖ్యలపై మండిపడ్డ కోటంరెడ్డి



**నెల్లూరు, (మనం న్యూస్):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన బ్రాండ్ ఇమేజ్‌తో రాష్ట్రాన్ని ముందుకు తీసుకు వెళ్తున్నారని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే, టీడీపీ నేత కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. అలాంటి సీఎంను అభినందించుకున్నా ఫర్వాలేదు కానీ.. ఆయనను శాపనార్థాలు పెడుతున్నారని మండిపడ్డారు. గతంలో హెలికాప్టర్ వద్ద తోపులాట జరిగితే పోలీసుల వైఫల్యం అంటూ

...మిగతా 2లో

## పార్లమెంట్ ఆవరణలో సైకిల్ ఎక్కిన బాలకష్ణ

**ఢిల్లీ, (మనం న్యూస్):** పార్లమెంటులో నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ సందడి చేశారు. పార్లమెంట్ ఆవరణలో విజయనగరం ఎంపీ అప్పలనాయుడు తాను రోజు పార్లమెంటుకు వచ్చే సైకిల్‌ను బాలకష్ణకు చూపించారు. దీంతో బాలకష్ణ కాసేపు సరదాగా ఆ సైకిల్ ఎక్కి ఫొటోలకు స్టిల్స్ ఇచ్చారు.అనంతరం టీడీపీ ఎంపీలతో కలిసి స్పీకర్ ఓం బిర్లాను మర్యాదపూర్వకంగా కలిశారు బాలకష్ణ. స్పీకర్‌ను ఘనంగా సన్మానించి పలు రాజకీయ అంశాలపై చర్చించినట్లు సమాచారం. ఆ తరువాత కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో భేటీ అయ్యారు. హిందూపురం నియోజకవర్గ అభివద్ధికి సంబంధించిన పలు వినతులను ఆయనకు సమర్పించారు. తెలుగు దేశం పార్టీ ప్రజా శ్రేయస్సు కోసం పనిచేస్తున్న పార్టీ అని, రాష్ట్ర అభివద్ధి కోసం ఎల్లప్పుడూ పాటుపడుతోందని బాలకష్ణ ఈ సందర్భంగా అన్నారు.



## సీఐడీ మాజీ చీఫ్ సంజయ్‌కు షాక్

ముందస్తు బెయిల్ రద్దు చేసిన సుప్రం

మూడు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశం

**న్యూఢిల్లీ, (మనం న్యూస్):** ఏపీ సీఐడీ మాజీ చీఫ్ సంజయ్ ముందస్తు బెయిల్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. సంజయ్‌కు ముందస్తు బెయిల్ ఇస్తూ గతంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేస్తూ గురువారం ఆదేశాలు జారీ చేసింది. అగ్నిమాపక విభాగంలో అవినీతి కేసులో ఆయనపై ఏపీ ప్రభుత్వం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో సంజయ్‌కు ఏపీ హైకోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చింది. ఉన్నత న్యాయస్థానం తీర్పును రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. దీనిపై సుదీర్ఘ వాదనల తర్వాత జస్టిస్ అమానుతుల్లా, జస్టిస్ ఎస్.వి.ఎన్ భట్టి ధర్మాసనం ఇవాళ తీర్పు వెలువరించింది. ఇకపోతే

...మిగతా 2లో

# రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా కుట్రలు

## వైసీపీ హయాంలో ఏపీ ఎంతో నష్టపోయింది



- ప్రభుత్వం మారుతోందంటూ సింగపూర్‌కు మెయిల్
- మెయిల్ చేసిన మురళీకృష్ణకు వైకాపాతో సంబంధాలు
- రాజధాని అమరావతి అభివృద్ధికి సింగపూర్ అంగీకారం
- రూ. 45 వేల కోట్ల పెట్టుబడులకు అవగాహన ఒప్పందాలు
- మీడియాతో మంత్రి నారా లోకేశ్

**అమరావతి, (మనం న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు రాకుండా చేయాలని వైసీపీ కుట్రలు పన్నుతోందని రాష్ట్ర ఐటీ-, విద్య శాఖ మంత్రి నారా లోకేష్ విమర్శించారు. రేపో మాపో ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం మారిపోతుందంటూ సింగపూర్ అధికారులకు మురళీకృష్ణ అనే వ్యక్తి ఈ మెయిల్ చేశారని తెలిపారు. మురళీకృష్ణకు వైసీపీ నేతలతో సత్సంబంధాలు ఉన్నాయని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులందరికీ ఈ మెయిళ్లు పెట్టారని వివరించారు. వైసీపీ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డికి చెందిన పీఎల్ఆర్ సంస్థతో మురళీకృష్ణకు సంబంధమున్నట్లు- తెలిసిందన్నారు. ఇదే క్రిమినలైజేషన్ ఆఫ్ పొలిటిక్స్ అని ఆయన అభివర్ణించారు. గురువారం అమరావతిలో మంత్రి నారా లోకేష్

...మిగతా 2లో

# నిందితులందరూ నిర్దోషులే

- 2008 నాటి మాలేగావ్ పేలుళ్ల కేసులో ప్రత్యేక కోర్టు తీర్పు
- మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పన నష్ట పరిహారం ఇవ్వాలని ఆదేశం
- నా 17 ఏండ్ల జీవితం నాశనమైందన్న ప్రధాన నిందితురాలు ప్రజ్ఞా ఠాకూర్





**ముంబై, జూలై 31:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2008 నాటి మాలేగావ్ పేలుడు కేసులో ముంబయిలోని ప్రత్యేక కోర్టు నేడు తీర్పు వెలువరించింది. ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్, లెఫ్టినెంట్ కర్నల్ ప్రసాద్ పురోహిత్ సహా మొత్తం ఏడుగురు నిందితులను ఎన్ఐఏ కోర్టు నిర్దోషులుగా తేల్చింది. ఈ మేరకు గురువారం తీర్పు వెలువరించింది. ఈ కేసు దర్యాప్తు, ప్రాసిక్యూషన్ వాదనలో చాలా లోటుపాట్లు ఉన్నాయని కోర్టు తెలిపింది. 'ఈ కేసుకు ఉపా (చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక) చట్టం వర్తించదు. ఈ పేలుడు కోసం వాడిన మోటార్

...మిగతా 2లో

## నిందితులంతా నిర్దోషులే ఐతే.. ఆ ఆరుగురిని ఎవరు చంపినట్టు?

### మాలేగావ్ పేలుళ్ల కేసు తీర్పుపై అసదుద్దీన్

ఈ తీర్పుపై ఫడ్నవీస్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ చేస్తుందా? అని ప్రశ్న

17 ఏళ్ల తర్వాత తీర్పు వెలువరించిన ఎన్ఐఏ కోర్టు

2

## జగన్ నెల్లూరు పర్యటనలో తీవ్ర ఉద్రిక్తత

- ఆంక్షలు ఉల్లంఘించిన వైకాపాశ్రేణులు
- లాఠీఛార్జ్ చేశారంటూ రోడ్డుపై ప్రసన్న బైఠాయింపు

**నెల్లూరు, (మనం న్యూస్):** వైఎస్ జగన్ నెల్లూరు పర్యటనలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. వందల మందితో తన నివాసానికి వెళ్లేందుకు మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి ప్రయత్నించారు. పరిస్థితి అదుపుతప్పే అవకాశం ఉండటంతో పోలీసులు అలర్ట్ అయ్యారు. వైసీపీ శ్రేణులను నిలువరించే ప్రయత్నం చేశారు. అయితే, పోలీసులతో వాగ్వాదానికి దిగారు ప్రసన్న కుమార్ రెడ్డి. మహిళా డీఎస్పీ సింధుపై సైతం దౌర్జన్యానికి పాల్పడ్డారు. దీంతో పోలీసులు.. లాఠీలు చుపుతూ వైసీపీ

...మిగతా 2లో





# నిన్న సుంకాలు.. నేడు ఆంక్షలు

## భారత్‌పై అమెరికా మరో ఆర్థిక దాడి

### భారత చమురు కంపెనీలపై ఆంక్షలు విధించిన ట్రంప్

**న్యూయార్క్, జూలై 31:** మన దేశం నుంచి దిగుమతి చేసుకుంటున్న సరుకులపై నిన్న 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నేడు మన చమురు కంపెనీలపై ఆంక్షలు విధించారు. ఇరాన్ నుంచి పెట్రోలియం ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారన్న అభియోగాలపై ప్రపంచవ్యాప్తంగా 20 సంస్థలపై అగ్రరాజ్యం చర్యలు చేపట్టింది. ఇందులో భారత్ కు చెందిన ఆరు కంపెనీలున్నాయి. ఈ మేరకు అమెరికా విదేశాంగ శాఖ తాజాగా ప్రకటన విడుదల చేసింది. 'చమురు విక్రయాలతో నిధులు సమకూర్చుకొని మధ్య ప్రాచ్యంలో సంఘర్షణలు, అస్థిరతకు ఇరాన్ ఆజ్యం పోస్తోంది. సొంత దేశ ప్రజలతో పాటు, ప్రపంచాన్ని అణచివేసేందుకు ఉగ్ర మూఠాలకు ఆర్థిక మద్దతు కల్పిస్తోంది. అందుకే టెహ్రాన్‌పై ఆర్థికఒత్తిడి తెచ్చేందుకు మేము కఠిన చర్యలు చేపట్టాం. ఇరాన్ నుంచి పెట్రోలియం, పెట్రోకెమికల్ ఉత్పత్తుల వాణిజ్యంలో భాగస్వాములైన 20 కంపెనీలపై

...మిగతా 2లో

# అధ్యయనం చేస్తాం.. చర్యలు తీసుకుంటం

## ట్రంప్ సుంకాల మోతపై పార్లమెంటులో పీయూష్ గోయల్ ప్రకటన



**ఢిల్లీ, జూలై 31:** మన వస్తువుల దిగుమతులపై అమెరికా విధించిన సుంకాలు, పెనాల్టీలపై కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ పార్లమెంటు ఉభయ సభల్లో ప్రకటన చేశారు. సుంకాల ప్రభావాలపై అధ్యయనం చేస్తున్నట్లు వెల్లడించారు. జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. పదేండ్లలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా భారత్ పయనిస్తోందన్న అంశాన్ని గుర్తుచేశారు. 'ఏప్రిల్ 2న

...మిగతా 2లో

## రోహింగ్యాలు శరణార్థులా? చొరబాటుదారులా?

ఈ అంశంపై స్పష్టత వస్తేనే సమస్యలు పరిష్కరించగలం

**ఢిల్లీ, జూలై 31:** రోహింగ్యాల వ్యవహారంపై సుప్రీం కోర్టు వాఖ్యలు చేసింది. అసలు వాళ్లు శరణార్థులా, చొరబాటుదారులా అనేదే పెద్ద సమస్య.. ఈ అంశంపై స్పష్టత వస్తే ఇతర సమస్యలు తేలికగా పరిష్కారమవుతాయని పేర్కొంది. రోహింగ్యాల విషయంలో దాఖలైన పలు పిటిషన్లను విచారించిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ కోటీశ్వర్ సింగ్ లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. 'శరణార్థులా లేదా చొరబాటుదారులా అనేదే ప్రధాన సమస్య. శరణార్థులుగా ప్రకటించేందుకు వారు అర్హులు కాదా? అలా ఐతే, వారికి ఎలాంటి రక్షణలు, హక్కులు ఉంటాయి? ఇక రెండో అంశం.. శరణార్థులు

...మిగతా 2లో

# పరామర్శలా.. బలప్రదర్శనలా?

**అమరావతి, (మనం న్యూస్):** పరామర్శల పేరుతో జగన్ బలప్రదర్శన చేస్తున్నారని ఏపీ హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత మండిపడ్డారు. నేరుగా వెళ్లి పరామర్శించకుండా ఇంత హంగామా చేయడం అవసరమా అని అన్నారు. పోలీసులు పరిమితంగా అనుమతి ఇచ్చినా కూడా తెలుసుకోకుండా ఇలా చేయడం దారుణమని అన్నారు. ఓ మాజీ సీఎంకు ఇది తెలియదా అని అన్నారు. జైళ్ల యాత్ర పేరుతో మాజీ సీఎం జగన్ విచిత్ర వేషాలు వేస్తున్నారని వంగలపూడి అనిత మండిపడ్డారు. మహిళలను ఎవరైనా కించపరిస్తే వారిని ప్రోత్సహిస్తామనే జగన్ ధోరణి సీఎంగా ఉన్నప్పుడు మారలేదని.. ఇప్పుడూ పోలేదని విమర్శించారు. చెల్లి వరుసయ్యే మహిళా నేతపై వ్యక్తిత్వ హననం చేసిన వారికి జగన్ మద్దతు పలకటాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. నెల్లూరులో జగన్ పర్యటనపై మంత్రి అనిత మీడియాతో మాట్లాడారు. వైకాపా మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలను కోర్టులు తప్పుపట్టాయి. సభ్య సమాజం ఛీకొడుతుంటే జగన్ ఒక్కరే వారికి మద్దతిస్తున్నారని అన్నారు. ఇలా ప్రజలకు ఏం సందేశం ఇవ్వబోతు న్నారని ప్రశ్నించారు. ఇదేనా జగన్ సిఎంగా చేసిన పాలన అన్నారు. రాజకీయంగా ప్రశాంతిరెడ్డిని ఎదుర్కోలేక చవకబారు వ్యాఖ్యలు చేసిన ప్రసన్నకుమార్‌రెడ్డికి జగన్ పరామర్శ సిగ్గుచేటన్నారు.. ఆస్తి పంపకాల విషయంలో తల్లీచెల్లిపై కోర్టులో గెలిచానని వీరంగం చేసే వ్యక్తిని జగన్‌లోనే చూశా. జగన్ చేసేది పరామర్శలా? బల ప్రదర్శనలా? పరామర్శల పేరుతో బలప్రదర్శనలు చేస్తే పోలీసులు అనుమతులు ఇవ్వాలా? జగన్ నెల్లూరు పర్యటనలో ఫేక్ విజువల్స్ ప్రసారం చేశారు. లేని జనాల్ని చూపించటానికి బంగారుపాళ్యం విజువల్స్‌ను నెల్లూరు పర్యటనగా చూపించారు. విశ్వసనీయత, పత్రికా విలువల గురించి గొప్పగా లెక్చర్లు ఇచ్చిన భారతీరెడ్డి ఈ ఫేక్ వీడియోలపై ఏం సమాధానం చెప్తారని మంత్రి అని ప్రశ్నించారు.

# సీఐడీ మాజీ చీఫ్ సంజయ్‌కు షాక్

(మొదటి పేజీ తరువాయి)

సంజయ్ కోర్టు ముందు లొంగిపోవడానికి మూడు వారాల సమయం ఇచ్చింది. సంజయ్ కస్టడీ కోసం మేజిస్ట్రేట్ కోర్టులో దర్యాప్తు సంస్థ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని, బెయిల్ కోరుతూ నిందితుడు మేజిస్ట్రేట్ కోర్టును ఆశ్రయించవచ్చని తెలిపింది. సంజయ్‌కి ముందస్తు బెయిల్ ఇస్తూ రాష్ట్ర హైకోర్టు 49 పేజీల తీర్పు రాయడంపై గత విచారణ సందర్భంగా ధర్మాసనం విస్మయం వ్యక్తం చేసింది. ముందస్తు బెయిల్ దశలోనే ట్రయల్ పూర్తి చేసినట్లు-ఉందని వ్యాఖ్యానించింది. నిర్వహించిన ప్రతి సదస్సులో 350 మంది హాజరయ్యారని చూపారు.. ఇదెలా సాధ్యం అని ప్రశ్నించింది. అన్ని సదస్సుల్లో ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ లేకుండా ఎలా ఉంటారని విస్మయం వ్యక్తం చేసింది. ముఖ్యమైన పదవుల్లో ఉన్న అధికారులు.. అన్ని చూసుకోవాలి గానీ, ఇష్టానుసారం చేస్తే ఎలా అని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అగ్నిమాపక శాఖలో నిరభ్యంతర పత్రాలు ఆన్‌లైన్‌లో జారీచేసేందుకు అగ్ని-ఎన్వోసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ అభివృద్ధి, నిర్వహణ, 150 ట్యాబ్‌ల సరఫరా కాంట్రాక్టును సౌత్రికా టెక్నాలజీస్ అండ్ ఇన్‌ఫ్రా సంస్థకు సంజయ్ అప్పగించారు. ఎలాంటి పనులూ జరగకపోయినా ఆ సంస్థకు రూ.59.93 లక్షల బిల్లులు చెల్లించేశారు. సీఐడీ తరఫున ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ- నిరోధక చట్టంపై దళితులు, గిరిజనులకు అవగాహన సదస్సుల నిర్వహణ కాంట్రాక్టును క్రిత్వ్యాప్ -టె-క్నాలజీస్‌కు ఇచ్చి, రూ.1.19 కోట్లు- చెల్లించారు. సదస్సులు మొత్తం సీఐడీ అధికారులే నిర్వహించారు. క్రిత్వ్యాప్ సంస్థ అసలు సదస్సులే నిర్వహించక పోయినా బిల్లుల పేరిట దోచేశారు. ఈ మేరకు ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ.2 కోట్ల మేర నష్టం కలిగించారని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రభుత్వానికి రెండు వేర్వేరు నివేదికలు సమర్పించింది. వాటి ఆధారంగా సంజయ్‌పై ఏసీబీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

# జగన్ నెల్లూరు పర్యటనలో తీవ్ర ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

మూకలను తరిమేశారు. పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రసన్నకుమార్ రెడ్డి.. ఆర్ అండ్ బీ బంగ్లా దగ్గర రోడ్డుపై బైఠాయించారు. తమ అనుచరులందరినీ రమ్మంటూ ఫోన్లలో సందేశాలు పంపించారు. భారీగా చేరుకున్న వైసీపీ శ్రేణులు.. రప్పా రప్పా అంటూ భయానకంగా నినాదాలు చేశారు. దీంతో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద గందరగోళం, ఉద్రిక్తత నెలకొంది. ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద ట్రాఫిక్‌కి ఆటంకం ఏర్పడింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో అలర్ట్ అయిన పోలీసులు.. పలు చోట్ల ట్రాఫిక్‌ను మళ్లించారు. మరోవైపు రోడ్డు ప్రయాణంలో జగన్ ఎక్కడంటే అక్కడే కాన్వాయ్ ఆపుతూ అభివాదాలు చేసుకుంటూ వెళ్లారు. శ్రీనివాసులరెడ్డి బొమ్మ సెంటర్ వద్ద జగన్‌ను చూసేందుకు వైసీపీ శ్రేణులు పోలీసులను నెట్టుకుంటూ వెళ్లారు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్తత నెలకొంది. కాగా, పలు కేసుల్లో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డితో వైఎస్ జగన్ గురువారం నాడు ములాఖత్ అయ్యారు. జైలు నుంచి మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి నివాసానికి వెళ్లారు. మహిళా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిపై తీవ్రస్థాయిలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో నిందితుడైన ప్రసన్నకుమార్ రెడ్డిని జగన్ పరామర్శించారు. ఇదిలాఉంటే.. జగన్ రాక సందర్భంగా భారీగా జనసమీకరణ చేశారు వైసీపీ నేతలు.

# నిందితులంతా నిర్దోషులే ఐతే.. ఆ ఆరుగురిని ఎవరు చంపినట్టు?..

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** మాలేగావ్ పేలుళ్ల కేసులో నిందితులంతా నిర్దోషులేనని కోర్టు తీర్పు వెలువరించడంపై ఎంఐఎం చీఫ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. నిందితులు అందరూ నిర్దోషులే అయితే 'ఆ ఆరుగురిని ఎవరు చంపినట్టు?' అని ప్రశ్నించారు. ఆధారాలు లేవంటూ నిందితులకు క్లీన్ చిట్ ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నమాజ్ చేస్తున్న వారిని మతం పేరుతో టార్గెట్ చేసి దాడి చేశారని ఆయన ఆరోపించారు. బాంబు పేల్చి ఆరుగురిని బలి తీసుకున్నారని, పేలుడు ధాటికి వంద మందికి పైగా గాయపడ్డారని ఎంపీ గుర్తుచేశారు. మతం పేరుతో జరిగిన ఈ దారుణం కోర్టులో నిరూపణ కాలేదని ఆయన విచారం వ్యక్తం చేశారు. కోర్టు తీర్పు అసంతృప్తిని కలిగించిందని వ్యాఖ్యానించారు. ముంబై సబర్బన్ రైలు పేలుళ్ల తీర్పుపై మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయాన్ని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ గుర్తుచేశారు. ఆ కేసులోనూ ఆధారాలు స్పష్టంగా లేవనే కారణంతో నిందితులను కోర్టు నిర్దోషులుగా విడుదల చేసిందని చెప్పారు. కోర్టు తీర్పు వెలువడిన తర్వాత మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని ప్రకటించారన్నారు. ఆ కేసు తరహాలోనే మాలేగావ్ పేలుళ్ల కేసు తీర్పుపైనా ఫడ్నవీస్, మోదీ ప్రభుత్వాలు సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాయా? అని అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు.

# ఆమె నవ్వుకు రూ.16.5 కోట్లు!

**బ్రిటిష్:** బ్రిటిష్ నటి, సింగర్ సింథియా ఎరివో తన నోటికి బీమా చేయించుకున్నారు. ఎంతో ఇష్టమైన తన నవ్వుకోసం ఏకంగా రూ.16.5 కోట్లు ఖర్చుపెట్టారు. మీడియా కథనాల ప్రకారం.. మౌత్ వాష్ బ్రాండ్ లిస్టెరిన్ నిర్వహిస్తోన్న 'వాష్ యువర్ మౌత్' కార్యక్రమానికి ఈమె ప్రచారకర్తగా ఉన్నారు. తన నవ్వు, గొంతుకు ఉన్న ప్రత్యేకత కారణంగానే వృత్తి, వ్యక్తిగత జీవితంలో రాణిస్తున్నానని ప్రకటించిన ఆమె దానికే అత్యంత ప్రాధానత్యనిస్తాను కాబట్టి అంత భారీ మొత్తానికి బీమా చేయించుకున్నట్టు ప్రకటించింది. తన రెండు దంతాల మధ్య ఉన్న గ్యాప్ ను, తన విలక్షణ నవ్వు, గళాన్ని కాపాడుకునేందుకే ఈ ఇన్సూరెన్స్ ఉపకరిస్తుందని చెప్పుకున్నారు ఎరివో.

# రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా కుట్రలు

(మొదటి పేజీ తరువాయి)

విలేకర్లతో మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో ఏపీ ఎంతో నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ పాలనలో ఏపీ బ్రాండ్‌ను దెబ్బతీశారని మండిపడ్డారు. రాజధాని అమరావతి సంయుక్త అభివృద్ధికి సింగపూర్ అంగీకారం తెలిపిందన్నారు. సింగపూర్ పర్యటనలో రూ. 45 వేల కోట్ల పెట్టుబడులకు అవగాహన ఒప్పందాలు కుదిరాయని చెప్పారు. సింగపూర్‌లో నాలుగు రోజుల్లో సీఎం చంద్రబాబు 26 మీటింగ్స్ నిర్వహించారని వివరించారు. 19 వన్ టూ వన్ మీటింగ్స్‌లో తాను సైతం పాల్గొన్నానని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో దేశంలోనే అతిపెద్ద స్టీల్‌ప్లాంట్, డేటా సెంటర్స్ ఏర్పాటు-కానున్నాయని చెప్పారు. అత్యధిక పన్నులు చెల్లింపు సంస్థగా ఉన్న అమర్ రాజా... పక్క రాష్ట్రానికి పారిపోయేలా చేశారని వివరించారు. అంతేకాదు.. లులూ గ్రూప్‌ను సైతం ఏపీ నుంచి జగన్ తరిమేశారని చెప్పారు. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణే తమ లక్ష్యమని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఏపీ బ్రాండ్‌ను తిరిగి సాధించేలా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ఏపీలో పెద్ద ఎత్తున డేటా సెంటర్లు రానున్నాయని తెలిపారు. ఆ క్రమంలో రాష్ట్రంలో టాటా ఇన్నోవేషన్ హబ్స్ ఏర్పాటు-కానుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని క్లస్టర్లుగా విభజించి.. అభివృద్ధికి శ్రీకారం చుట్టామని తెలిపారు. యువతకు ఉద్యోగాల కల్పన కోసం నైపుణ్య శిక్షణపై దృష్టి సారించినట్లు- వివరించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత ఏపీకి బ్రాండ్ తిరిగొచ్చిందన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు పరిశ్రమలు వస్తున్నాయని చెప్పారు. వైసీపీ హయాంలో ఏకపక్షంగా సింగపూర్ ఒప్పందాలు రద్దు చేశారని ఆరోపించారు. వైసీపీ హయాంలో సింగపూర్ ప్రభుత్వంపై అవినీతి ముద్ర వేశారని గుర్తు చేశారు. విశాఖను ఐటీ- పటంలో పెట్టాలని తాము నిర్ణయించామని తెలిపారు.



టీ-సీఎస్‌కు రూ.99 పైసల చొప్పున భూమి కేటాయించామని మంత్రి నారా లోకేష్ వివరించారు. వైఎస్ జగన్ నెల్లూరు జిల్లా పర్యటన సందర్భంగా రాష్ట్రంలో ఎమర్జెన్సీ వాతావరణం ఉందని విమర్శించారు. దీనిపై నారా లోకేష్ తనదైన శైలిలో ప్రశ్నించారు. ఎమర్జెన్సీ వాతావరణం ఉంటే అసలు జగన్ బయటకు రాగలరా..? అంటూ ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు ఇంటి గేటు-కు తాళ్లేసి కట్టలేదా..? అని గుర్తు చేశారు. భద్రతగా పోలీసులను పెడితే.. పోలీసులను మొహరించారని అంటారని.. పోని పోలీసులను పెట్టకుంటే భద్రత ఇవ్వలేదని పేర్కొంటారన్నారు. సొంత తల్లి, చెల్లి మీద ఎవ్వడైనా కేసులు పెడతారా..? అంటూ వైఎస్ జగన్ వ్యవహార శైలిని ఈ సందర్భంగా నిలదీశారు. ఆ కేసులో గెలిచానని సంబరాలు చేసుకుంటారా..? అంటూ సందేహం వ్యక్తం చేశారు. తల్లి మీద కేసు పెట్టి సంబరాలు చేసుకునే ఏ-కై-క వ్యక్తి జగన్ మోహన్ రెడ్డే అని ఆయన వ్యంగ్యంగా అన్నారు. తల్లి, చెల్లికి అన్యాయం చేసిన వ్యక్తి అసలు నాయకుడిగా పని కోస్తాడా..? అంటూ నారా లోకేష్ అనుమానం వ్యక్తం చేశారు. మద్యం కుంభకోణం కేసులో వైఎస్ జగన్ అరెస్ట్ అవుతారా అంటూ విలేకరి అడిన ప్రశ్నకు మంత్రి నారా లోకేష్ ఆసక్తికర కామెంట్ చేశారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందంటూ ఆయన వ్యాఖ్యానించారు.

# రేపట్నుంచి అన్నదాత సుఖీభవ

(మొదటి పేజీ తరువాయి)

నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో పీఎం కిసాన్ మొదటి విడత కింద కేంద్ర ప్రభుత్వం రూ.831.51 కోట్లు- రైతుల ఖాతాలో జమచేయనుంది. కాగా, రాష్ట్ర రాజధాని అమరావతి బ్యూటిఫికేషన్, గ్రీన్ -బ్లూ మాస్టర్ ప్లాన్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్, ఏడీసీ సీఎండీ లక్ష్మీ పార్థసారథి హాజరయ్యారు. అమరావతిలో ట్రంక్ రోడ్లు, ఇతర అనుబంధ రోడ్లు, ఎల్పీఎస్ రోడ్లు, బఫర్ జోన్లలో ఎలాంటేషన్, బ్యూటిఫికేషన్, అవెన్యూ ఎలాంటేషన్‌పై చర్చించారు. అమరావతిలో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో పార్కులు, హరిత ప్రాంతం ఉండేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఔషధ మొక్కలను నాటడంతో పాటు- అమరావతిలో బయోడైవర్సిటీ- ఉండేలా కార్యాచరణ చేపట్టాలని అధికారులకు సీఎం సూచించారు. గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో దేశీయ వృక్షజాతులు ఉండేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు. రివర్ ఫ్రంట్ కూడా సుందరంగా కనిపించేలా శ్రద్ధ పెట్టాలని అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

# బాబు కాదు..నీవే బావిలో దూకాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వంపై నిందలు వేశారని గుర్తు చేశారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ నెల్లూరు పర్యటనలో భాగంగా చేసిన వ్యాఖ్యలపై కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి స్పందించారు. గురువారం నెల్లూరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. అయితే వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ నెల్లూరు పర్యటన సందర్భంగా.. ముందస్తు చర్యలు తీసుకుంటే ఆంక్షలంటున్నారని వైసీపీ నేతల వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబును బావిలో దూకాలని వైఎస్ జగన్ అంటున్నారు.. కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన వైఎస్ జగన్ బావిలో దూకాలని పేర్కొన్నారు. జగన్ పర్యటన సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ చెయ్యి విరగొట్టారన్నారు. ప్రభుత్వాసుపత్రి గోడను సైతం కూలగొట్టారని తెలిపారు. నడి రోడ్డుపై ధర్నాలకు దిగారన్నారు. వీరందరిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి ఆయన సూచించారు. అలా అయితేనే ఈ తరహా ఘటనలు పునరావృతం కావని ఆయన స్పష్టం చేశారు. వైఎస్ జగన్ వెంట ఉన్న అనుచర గణం వ్యవహరిస్తున్న తీరును ఈ సందర్భంగా కోటంరెడ్డి ఎండగట్టారు. చర్యకు ప్రతి చర్య తప్పకుండా ఉంటు-ందని వారికి సూచించారు. గత ఐదేళ్ల అధికారంలో ఉండి.. అన్ని వ్యవస్థలను నాశనం చేశారంటూ వైఎస్ జగన్‌పై మండిపడ్డారు. జిల్లాలో వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులకు తాము తప్పకుండా సమాధానం ఇస్తామన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌ను అన్ని రంగాల్లో పరుగులు పెట్టిస్తున్నారని సీఎం చంద్రబాబు నాయుడిని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ ప్రశంసించారు. రాష్ట్రానికి సీఎంగా చంద్రబాబు ఉండడం వల్లే.. ప్రభుత్వ ఉద్యోగులకు నెలనెలా జీతాలు అందుతున్నాయన్నారు. సీఎం చంద్రబాబుపై విమర్శలు చేసే ముందు ఆత్మ పరిశీలన చేసుకోవాలని వైఎస్ జగన్‌కు ఆయన సూచించారు. గత ప్రభుత్వ హయాంలో టీ-డీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర చేస్తున్న సమయంలో ఎన్నో అడ్డంకులు సృష్టించారని గుర్తు చేశారు. అదే సమయంలో వైఎస్ జగన్ ప్రభుత్వం అడ్డగోలుగా ఎన్నో నిర్ణయాలు తీసుకుందని ఎమ్మెల్యే కోటంరెడ్డి వివరించారు. గత ఐదేళ్లలో టీ-డీపీ సీనియర్ల మీద ఏ విధంగా కేసులు పెట్టావో మరిచిపోయావా అంటూ వైఎస్ జగన్‌ను సూటిగా ప్రశ్నించారు. గతంలో అక్క, అన్నా అంటూ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతుల చుట్టు- వైఎస్ జగన్ తిరిగారన్నారు. ఆ తర్వాత వారిపై ప్రసన్నకుమార్ రెడ్డి తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడంతో.. అతడిని వైఎస్ జగన్ వెనకేసుకు వస్తున్నాడన్నారు.

మీకు ఇంగిత జ్ఞానం ఉంటే.. సీఎం చంద్రబాబు నాయుడికి, నెల్లూరు జిల్లా ప్రజలకు క్షమాపణలు చెప్పాలని వైఎస్ జగన్‌ను డిమాండ్ చేశారు. టీ-డీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిపై జగన్ మైనింగ్ ఆరోపణలు చేశారన్నారు. ఇదే మైనింగ్ మీ తాత వైఎస్ రాజారెడ్డి సైతం చేశారని ఈ సందర్భంగా వైఎస్ జగన్‌కు గుర్తు చేశారు.

# లిక్కర్ స్కామ్‌లో పెట్టెలే దొరికాయి.. కంటైనర్లు దొరకాల్సి ఉంది

(మొదటి పేజీ తరువాయి)

దేవినేని ఉమా బయట పెట్టారు. లిక్కర్ కుంభకోణంలో పెట్టెలు మాత్రమే దొరికాయి కంటైనర్లు దొరకాల్సి ఉందన్నారు. నువ్వు పెట్టే యాప్‌లో కంటైనర్ల డబ్బులు, బంగారం ఏమయ్యాయో చెప్పమని ప్రజలు మిమ్మల్ని అడుగుతారని పేర్కొన్నారు. వ్యూహకర్తలతో బెంగుళూరు ప్యాలెస్‌లో సమావేశాలు పెట్టి రాష్ట్ర ప్రతిష్టను దెబ్బ తీసే కుట్రలు చేస్తున్నాడంటూ వైఎస్ జగన్‌పై దేవినేని ఉమా నిప్పులు చెరిగారు.మహిళలను కించ పరిచిన నీ నాయకుడికి మద్దతిస్తూ నువ్వు ఏం చెప్ప దలుచుకున్నావంటూ వైఎస్ జగన్‌ను సూటిగా ప్రశ్నించారు. గత శాసనసభలో మహిళలను కించ పరుస్తూ మాట్లాడినందుకే 11 సీట్లు ఇచ్చి రాష్ట్ర ప్రజలు చెప్పుతో కొట్టారన్నారు. అయినా జగన్ పరివర్తనలో ఏ మాత్రం మార్పు లేకుండా బుద్ధి జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నాడంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

మంత్రి పదవికి ఆశపడి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నీ పంచన చేరితే ఆయన కుమారుడు మిధున్ రెడ్డిని లిక్కర్ స్కామ్‌లో భాగస్వామిని చేశావంటూ ఎద్దేవా చేశారు. నీ లిక్కర్ దోపిడీలో భాగస్వామ్యులైన మిధున్ రెడ్డి, ధనుంజయ రెడ్డి సహా ప్రతి ఒక్కరూ శిక్ష అనుభవించక తప్పదని టీడీపీ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమా స్పష్టం చేశారు.



# తిరుమలలో రీల్స్ చేస్తే కఠిన చర్యలు

## హెచ్చరించిన టిటిడి అధికారులు

**తిరుమల:** రీల్స్ పిచ్చిలో కొందరు తిరుమల పవిత్రతకు భంగం కలిగిస్తున్నారు. అలాగే స్వామికి అపచారం చేస్తున్నారు. దీనిపై టిటిడి తీవ్రంగా స్పందించింది. ఇలాంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. తిరుమల శ్రీవారి ఆలయం ముందు, మాడ వీధుల్లో కొంతమంది వెకిలి చేష్టలు, డ్యాన్సలతో సోషల్ మీడియా రీల్స్ చేస్తుండటంపై తిరుమల తిరుపతి దేవస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి వీడియోలు చిత్రీకరించేవారిని తితిదే విజిలెన్స్ సిబ్బంది గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించింది. భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఈ తరహా చర్యలు ఆధ్యాత్మిక వాతావరణానికి విఘాతం కలిగిస్తున్నాయని తితిదే పేర్కొంది. పవిత్రమైన క్షేత్రంలో ఇలాంటి అభ్యంతరకర, అసభ్యకర చర్యలు అనుచితమని.. ఇక్కడ కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం కావాలని సూచించింది. తిరుమల క్షేత్రం భక్తి, ఆరాధనలకు నిలయమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని పేర్కొంది. శ్రీవారి దర్శనార్థం వచ్చే లక్షలాది మంది భక్తుల మనోభావాల పట్ల గౌరవం చూపడం ప్రతి ఒక్కరి బాధ్యత అని.. క్షేత్ర పవిత్రతకు భంగం కలిగేలా వ్యవహరించే వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపడతామని తితిదే తెలిపింది.

# అధ్యయనం చేస్తాం.. చర్యలు తీసుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)


అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతీకార సుంకాలపై కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీ చేశారు. భారత్ ఉత్పత్తులపై 26 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు ప్రకటించారు. ఏప్రిల్ 9 నుంచి అమల్లోకి వచ్చేలా షెడ్యూల్ చేశారు. అనంతరం దాన్ని 90 రోజులపాటు తాత్కాలికంగా వాయిదా వేశారు. అప్పటివరకు 10 శాతం సుంకాలు విధించారు. ఆపై ఆగస్టు 1 వరకు పొడిగించారు. ఇరుదేశాల మధ్య పరస్పర ప్రయోజనకరమైన 'ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం' కోసం మార్చిలో చర్చలు ప్రారంభమయ్యాయి. అక్టోబర్- నవంబర్ నాటికి ఒప్పందం మొదటి దశను పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం'' అని పీయూష్ గోయల్ తెలిపారు.

రష్యాతో వ్యాపారాన్ని కొనసాగిస్తే భారీగా సుంకాలు విధిస్తామని భారత్ సహా పలు దేశాలను ఇటీవల పలుమార్లు అమెరికా హెచ్చరిస్తూ వచ్చింది. ఈ క్రమంలో ఇదే కారణాన్ని చూపుతూ.. భారత్ ఉత్పత్తులపై 25శాతం సుంకంతోపాటు, పెనాల్టీలు కూడా విధించింది. ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ ఒకటని ట్రంప్ ఆరోపించారు. రష్యా నుంచి దిగుమతుల కారణంగా యూఎస్ పెనాల్టీలకు గురైన తొలి దేశం భారత్. రష్యాతో భారత్ ఎలాంటి వాణిజ్య ఒప్పందం చేసుకున్నా తనకు సంబంధం లేదని.. వారి ఆర్థిక వ్యవస్థలను మరింత పతనం చేసుకుంటున్నాయని ట్రంప్ కామెంట్ చేశారు.

# రోహింగ్యాలు శరణార్థులా? చొరబాటుదారులా?

(మొదటి పేజీ తరువాయి)

కాకుంటే, అక్రమ వలసదారులైతే.. వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బహిష్కరించే చర్య సరైనదేనా? చొరబాటుదారులను నిరవధికంగా నిర్బంధించడం లేదా బెయిల్ విడుదల చేయవచ్చా? కోర్టులు ఎటువంటి షరతులు విధించవచ్చు? అని అని సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది మాట్లాడుతూ.. రోహింగ్యాల నిర్బంధమే కీలక అంశమని, వారిని నిరవధికంగా అలా కొనసాగించలేరని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. వాదనలు విన్న ధర్మాసనం.. రోహింగ్యాలకు సంబంధించి దాఖలైన అనేక పిటిషన్లను మూడు విభాగాలుగా విభజించి విచారణ చేపడతామని పేర్కొంది. ప్రతి బుధవారం వీటిని విచారించేందుకు సమయాన్ని కేటాయిస్తామని తెలిపింది. ఈ ఏడాది మే నెలలో రోహింగ్యాల ఉనికిపై విచారణ జరిపిన సుప్రీం కోర్టు దేశంలో ఉన్న రోహింగ్య శరణార్థులు విదేశీయులని తేలితే, భారత చట్టాల ప్రకారం వారిని తిరిగి పంపించాల్సిందేనని అభిప్రాయపడింది. యూఎన్ హెచ్ సీఆర్ జారీ చేసిన ఐడీ కార్డులు కూడా వారికి ఎటువంటి సాయం చేయకపోవచ్చంటూ అంతకుముందు ఇచ్చిన ఆదేశాలను గుర్తుచేసింది. ఇదిలాఉంటే, దేశంలో 12 రాష్ట్రాల్లో రోహింగ్యాలు నివసిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ఢిల్లీ, తెలంగాణ, యూపీ, పశ్చిమ బెంగాల్, తమిళనాడుతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో వీరు ఉంటున్నప్పటికీ.. కచ్చితంగా ఎంత మంది ఉన్నారనే దానిపై స్పష్టత లేదని కేంద్ర హోంశాఖ గతంలో ఓసారి తెలియజేసింది.



# నిన్న సుంకాలు.. నేడు ఆంక్షలు

(మొదటి పేజీ తరువాయి)

ఆంక్షలు విధిస్తున్నాం' అని అగ్రరాజ్యం ఒక ప్రకటన చేసింది. భారత్ తో పాటు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, తుర్కియే, ఇండోనేషియా దేశాలకు చెందిన కంపెనీలపైనా ఈ ఆంక్షలు విధించింది.

**ఆంక్షలు పడిన భారత కంపెనీలు ఇవే..**

**కాంచన్ పాలిమర్స్:** 2024 ఫిబ్రవరి నుంచి జులై మధ్య 1.3 మిలియన్ డాలర్ల విలువైన ఇరాన్ పాలిథీన్, పెట్రోకెమికల్ ఉత్పత్తులను యూఏఈ మధ్యవర్తిత్వ కంపెనీ నుంచి కొనుగోలు, దిగుమతి చేసుకున్నట్లు అమెరికా ఆరోపించింది.

**ఆల్కెమికల్ సొల్యూషన్స్:** ఇది పెట్రోకెమికల్ ట్రేడింగ్ కంపెనీ. 2024 జనవరి నుంచి డిసెంబర్ వరకు ఇరాన్ నుంచి 84 మిలియన్ డాలర్ల విలువైన పెట్రోకెమికల్ ఉత్పత్తులను దిగుమతి చేసినట్లు అమెరికా తన అభియోగాల్లో పేర్కొంది.

**రమణిక్లాల్ ఎస్ గోసాలియా అండ్ కంపెనీ:** 2024 జనవరి నుంచి 2025 జనవరి వరకు 22 మిలియన్ డాలర్ల విలువైన మిథనాల్, టోల్యూన్, పెట్రోకెమికల్ ఉత్పత్తులను కొనుగోలు, దిగుమతి చేసుకున్నట్లు అగ్రరాజ్యం ఆరోపించింది.

**జుపిటర్ డై కెమ్ ప్రైవేట్ లిమిటెడ్:** 2024-25లో 49 మిలియన్ డాలర్లకు పైగా విలువైన ఇరాన్ ఉత్పత్తులను దిగుమతి చేసినట్లు అభియోగాల్లో పేర్కొంది.

**గ్లోబల్ ఇండస్ట్రియల్ కెమికల్స్ లిమిటెడ్:** గతేడాది కాలంలో 51 మిలియన్ డాలర్ల విలువైన పెట్రోకెమికల్స్ను ఇరాన్ నుంచి కొన్నట్లు యూఎస్ ఆరోపించింది.

**పర్సిస్టెంట్ పెట్రోకెమ్ ప్రైవేట్ లిమిటెడ్:** గతేడాది 14 మిలియన్ డాలర్ల విలువైన మిథనాల్తో సహా ఇరాన్ పెట్రో కెమికల్స్ను కొనుగోలు చేసినట్లు అమెరికా తమ అభియోగాల్లో వెల్లడించింది.

ఈ కంపెనీలన్నీ ఉద్దేశపూర్వకంగానే ఇరాన్ తో వాణిజ్యంలో భాగస్వాములయ్యాయని వాషింగ్టన్ తెలిపింది. ఆంక్షలు విధించడంతో ఇప్పుడు ఆయా కంపెనీలు, వ్యక్తులకు అమెరికాలో ఆస్తులు ఉంటే వాటిని ఫ్రీజ్ చేస్తారు.

# నిందితులందరూ నిర్దోషులే

(మొదటి పేజీ తరువాయి)

బైక్ మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ పేరు మీద రిజిస్టర్ అయిందని ప్రాసిక్యూషన్ చేసిన వాదనకు తగిన సాక్ష్యాధారాలు లేవు. ఆ బైక్ కు అమర్చిన బాంబు వల్లే పేలుడు సంభవించిందని చెప్పేందుకు కూడా ఆధారాల్లేవ్. ఉగ్రవాదానికి మతం లేదు. ఎందుకంటే ఏ మతం కూడా హింసను ప్రోత్సహించదు. కానీ, కేవలం ఊహాగానాలు, నైతిక ఆధారాలతో ఎవరినీ కోర్టులు శిక్షించవు. బెనిఫిట్ ఆఫ్ డౌట్ మినహా ఈ కేసులో ఎలాంటి బలమైన ఆధారాల్లేవు' అని తీర్పులో కోర్టు వెల్లడించింది.

ఈ కేసులో ఆరుగురు మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది. క్షతగాత్రులకు రూ.50వేల ఆర్థికసాయం ఇవ్వాలని సూచించింది.

**నన్ను బాధ పెట్టిన వారిని దేవుడే శిక్షిస్తాడు..**

తీర్పుపై మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ హర్షం వ్యక్తంచేశారు. ఈ కేసు కారణంగా గత 17 ఏళ్ల పాటు తన జీవితం నాశనం అయ్యిందన్నారు. తనను బాధ పెట్టిన వారిని దేవుడే శిక్షిస్తారని అన్నారు. మరోవైపు, ఈ తీర్పును తాము హైకోర్టులో సవాల్ చేయనున్నట్లు బాధిత కుటుంబాలు వెల్లడించాయి.

**ఏమిటీ పేలుళ్లు..?**

మహారాష్ట్ర లోని మాలేగావ్ ప్రాంతంలో 2008 సెప్టెంబరు 29న పేలుడు సంభవించింది. ఓ మసీదు సమీపంలో మోటార్ సైకిల్ కు అమర్చిన బాంబు పేలడంతో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు.

# చంద్రగిరిలో 'బాబు షూరిటీ.. మోసం గ్యారంటీ' ప్రారంభం!

- జగనన్న హయాంలోనే సంక్షేమం బాబు పాలనలో సంక్షోభం..
- ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజం..
- అబద్ధాలతో అధికారం చేపట్టి.. అందరినీ మోసం చేశారు
- మీ ఇళ్లకు వచ్చే కూటమి నేతలను చొక్కా పట్టుకుని అడగాలి
- అక్రమ అరెస్టులతో భాస్కరున్ని ఎవ్వరు భయపెట్టలేరు
- అదే అక్రమ కేసులో మోహిత్ రెడ్డిని ఇరికించడం దుర్మార్గం
- ప్రారంభోత్సవ సభలో జిల్లా పార్టీ అధ్యక్షుడు భూమన

**తిరుపతి రూరల్, జూలై 31(మనం న్యూస్) :** 'జగనన్న పాలనలో ప్రజలకు సంక్షేమం అందింది.. బాబు ప్రభుత్వంలో సంక్షోభం తప్ప సంక్షేమం కంటికి కనిపించడం లేదు.. ఎన్నికలపుడు మాయమాటలు చెప్పడం.. అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజం.. అబద్ధాలతో అధికారం చేపట్టిన చంద్రబాబు, పవన్ కల్యాణ్లు ఏడాది గడిచినా ఒక్కటంటే ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు.. అందరినీ మోసం చేశారు.. అన్ని వర్గాల ప్రజలు జగనన్నే మేలు అనుకునేలా చేస్తున్నారు.. సూపర్ సిక్స్ పథకాలను అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబు ఏడాది గడిచినా ఆ ఊసే ఎత్తుకోవడం లేదు.. ఉచిత గ్యాస్ ఇస్తామన్నారు.. తుస్సు మనిపించారు.. ఇదిగో అమ్మకు వందనం అన్నారు.. ఎవ్వరికీ అందకుండా చేశారు.. ఆడబిడ్డ నిధి అన్నారు.. ఆ పథకాన్ని ఆమడదూరం చేసేశారు.. నిరుద్యోగులకు శఠగోపం పెట్టారు.. ఉద్యోగులకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారు.. ఇలా ఒకటి కాదు.. రెండు కాదు 143 హామీలు ఇచ్చిన చంద్రబాబు.. ఒక్కటి అమలు చేయకుండా మోసం చేశారు.' అంటూ వైఎస్ఆర్సీపీ జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్రెడ్డి ఆరోపించారు.

చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట గ్రామంలో గురువారం 'బాబు షూరిటీ.. మోసం గ్యారంటీ' రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని భూమన చేతులు మీదుగా ప్రారంభించారు. వైఎస్ఆర్సీపీ ఇన్చార్జి చెవిరెడ్డి మోహిత్రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆరు మండలాలకు చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూమన మాట్లాడుతూ చెవిరెడ్డి మోహిత్రెడ్డి ఆధ్వర్యంలో బాబు చేసిన మోసాలతో పాటు చెవిరెడ్డి కుటుంబంపై చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న




కుట్రలను, కక్ష సాధింపు చర్యలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలన్నారు. ఎన్నికలకు ముందు మాయమాటలు చెప్పడం, అధికారంలోకి వచ్చాక దానిని మాయచేసి మోసం చేయడానికి ప్రతిపక్షంపై నిందలు వేయడం బాబుకు వెన్నతోపెట్టిన విద్య అని విమర్శించారు. బాబు షూరిటీ.. మోసం గ్యారంటీ అన్న కార్యక్రమంలో చంద్రబాబు మోసాన్ని ప్రజలకు బట్ట బయలు చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని, అప్పుడే చంద్రబాబు మళ్లీ మోసం చేశారన్న నిజం ప్రజలకు తెలుస్తుందన్నారు. జగనన్నకు అతి దగ్గరగా వున్నందునే తన తమ్ముడు చెవిరెడ్డి భాస్కర్రెడ్డిపై అక్రమ కేసులు పెట్టి జైలులో 44 రోజులుగా బధించారని, అదే కేసులో భాస్కర్ బిడ్డ చెవిరెడ్డి మోహిత్రెడ్డిని కూడా ఇరికించడం దుర్మార్గమన్నారు. ఇలాంటి విషయాలు పచ్చ పత్రికలు ముందే రాస్తాయని, ఎల్లో మీడియా ఓ కట్టు కథను అల్లుతాయని.. పోలీసుల ఆ కథను క్రైంగా అమలు చేస్తున్నారని ఆరోపించారు. పాతికేళ్లు నిండిన చెవిరెడ్డి మోహిత్రెడ్డిని జైలుకు పంపాలని ఈ ప్రభుత్వం చేస్తున్న కుట్రలు అంతా ఇంతా కాదని, అయితే ఏ తప్పు చేయకుండా జైలుకు వెళ్లి తిరిగి వచ్చిన వారు రాజకీయంగా ఎంతో ఎత్తుకు ఎదుగుతుండగా అక్రమంగా జైలుకు పంపిన వారి జీవితాలు మాత్రం పతనం కాక తప్పవని హెచ్చరించారు. అందుకు ఉదాహరణగా గతంలో సోనియాగాంధీ, చంద్ర బాబు ఇద్దరు కుట్రలు చేసి వైఎస్ జగ్న 18 రకాల కేసులు పెట్టి 18 నెలల పాటు జైలులో బంధిస్తే, ఆ తరువాత బయటకు వచ్చిన జగన్ విక్రమార్కునిలా దూసుకువచ్చి ముఖ్యమంత్రి పీఠం ఎక్కారన్నారు. ఈ దుర్మార్గపు ప్రభుత్వం మళ్లీ జగన్ను జైలుకు పంపుతుందని.. అందులో భాగమే ఆయన చుట్టు వున్న వారిని అక్రమ కేసుల్లో ఇరికించారన్నారు. చంద్రబాబు మోసాలు, చెవిరెడ్డి కుటుంబంపై ఆయన ప్రభుత్వం చేస్తున్న కుట్రలను చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పాల్సిన బాధ్యత పార్టీ క్యాడర్ తీసుకోవాలని సూచించారు.

అండగా నిలబడ్డ వారందరినీ గుర్తు పెట్టుకుంటా

చంద్రగిరి నియోజకవర్గంలో చెవిరెడ్డి కుటుంబానికి కష్టం వస్తే ఆ కుటుంబానికి మేమున్నామని అండగా నిలబడి రోడ్డెక్కిన ప్రతి ఒక్కరినీ గుర్తు పెట్టుకుంటా.. రేపు మన పార్టీ అధికారంలోకి వచ్చాక అందరికీ చేయగలిగినంత సాయం చేసి రుణం తీర్చుకుంటానని చెవిరెడ్డి మోహిత్రెడ్డి మాట ఇవ్వడంతో పార్టీ నేతలు, కార్యకర్తలు నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. చంద్రగిరి నుంచి తాను ప్రాథినిత్యం వహించడం ఒక అదృష్టంగా భావిస్తున్నానని, తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఇబ్బందులు పెడుతున్నా.. ఏ మాత్రం భయపడకుండా తమకు అండగా నిలిచి అక్రమ అరెస్టులను నిరసిస్తూ ఆందోళనలు చేయడం చూస్తుంటే పార్టీ శ్రేణుల రుణం ఎన్నటికీ తీర్చుకోలేమనిపిస్తోందన్నారు. తమ కుటుంబానికి కష్టం వస్తే మీ కుటుంబంలో ఒక్కరికి భావించి ఆరు మండలాల్లో వేలాది మంది నాయకులు, కార్యకర్తలు పోరాడటం చూస్తుంటే తనకు కొండంత బలం అండగా నిలబడిందన్న ధైర్యం కలుగుతోందన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంగా ఎన్ని మోసాలు చేశారో అన్నీ ప్రజలకు చెప్పే సమయం వచ్చిందన్నారు. జగనన్న ఆదేశాలు మేరకు పార్టీలో ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త తమ తమ గ్రామాల్లోకి వెళ్లి బాబు షూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం ద్వారా ఈ ప్రభుత్వం చేసిన మోసం, చెప్పిన అబద్ధాలను వివరించాలన్నారు. అంతేకాక ఆ నాడు ఏం చెప్పారన్న విషయాలు అందరికీ తెలిసేలా బాబు మేనిఫెస్టోను గుర్తు చేస్తూ ఆ కుటుంబం ఎంత నష్టపోయారో వివరించాలన్నారు. ఎన్నికలకు ముందు ఆడబిడ్డ నిధి కింద ప్రతి మహిళకు ఇస్తామన్న రూ.1500లు, నిరుద్యోగులకు ఇస్తామన్న నిరుద్యోగ బృతి రూ.3వేలు ఎక్కడ ఇచ్చారో నిజం చెప్పాలని నిలదీశారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పి ముందుగా లబ్ధిదారులే డబ్బులు కడితే ఆ తరువాత వారి అకౌంట్లకు పంపుతామని చెప్పిన చంద్రబాబు అందరినీ మోసం చేశారన్నారు. పచ్చి అబద్ధాలు చెప్పి అందలమెక్కిన చంద్రబాబుతో పాటు ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఇళ్ల వద్దకు వచ్చినపుడు చొక్కాపట్టుకుని అడగాలని సూచించారు. చివరగా రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూ ఆర్ కోడ్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ చిత్తూరు జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు చెవిరెడ్డి హర్షిత్రెడ్డి, ఆరు మండలాల నుంచి వచ్చిన ఎంపీపీలు, జడ్పీటీసీలు, సీనియర్ పార్టీ నేతలు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతి నిధులు, మహిళా నేతలు పాల్గొన్నారు.

# దేశంలో అత్యంత నీఛమైన పాలన జగన్ రెడ్డిదే

- తనకు తానే మహాత్మునిలా ఫీలవుతున్నాడు
- జగన్ తీసుకొచ్చే యాప్‌లో అతని బాధితులే మొదట ఫిర్యాదు చేస్తారు
- నీ బాబాయ్ కూతురు సునీత, నీ చెల్లి, తల్లే ముందుగా ఫిర్యాదు చేస్తారు
- వైసీపీ పాలనలో కల్తీ మద్యం వల్ల నష్టపోయిన 30వేల కుటుంబాలు ఫిర్యాదుకు సిద్ధం
- ల్యాండ్ టైటిల్ యాక్ట్, జీఓ 22ఏ బాధితులంతా ఫిర్యాదుకు సిద్ధంగా ఉన్నారు
- జగన్‌పై ధ్వజమెత్తిన శాప్ ఛైర్మన్ రవి నాయుడు

**తిరుపతి, జూలై 31(మనం న్యూస్) :** యావత్ భారతదేశంలో అత్యంత నీఛంగా, క్రూరంగా రాష్ట్రాన్ని పాలించిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది కేవలం వైఎస్.జగన్మోహన్ రెడ్డి మాత్రమేనని శాప్ ఛైర్మన్ రవినాయుడు ఘాటుగా విమర్శించారు. అధికారమదంతో అక్రమాలు, అరాచకాలతో భూమి, ఇసుక, మైగింగ్, మెడికల్, మద్యం వంటి దందాలకు పాల్పడి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది నువ్వు కాదా జగన్ అంటూ మండిపడ్డారు. దోచుకుని దాచుకుందే కాకుండా ముఖ్యమంత్రిగా పనిచేశాననే విషయం



మరిచిపోయి రాత్రికి రాత్రే మహాత్మునిలా, గౌతమ బుద్ధునిలా ప్రవర్తిస్తే ప్రజలు నమ్ముతారనుకుంటున్నావా జగన్ అంటూ సూటిగా ప్రశ్నించారు. వైసీపీ కార్యకర్తల కోసం ప్రత్యేక యాప్ తీసుకొస్తానంటూ జగన్ విద్వేషాలను రెచ్చగొడుతూ చేసిన వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందిస్తూ తిరుపతి ప్రెస్క్లబ్లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. జగన్ నీ పాలనలో నష్టపోయిన లక్షలాది కుటుంబాలు నువ్వు తీసుకొచ్చే యాప్లో ఫిర్యాదు చేయడానికి సిద్ధంగా ఉన్నాయని అన్నారు. ముందుగా నీ బాబాయ్ కూతురు సునీత, నీ చెల్లి, తల్లీ కూడా నువ్వు తీసుకొచ్చే యాప్ లో ఫిర్యాదు చేయబోతున్నారని వెల్లడించారు.

వైసీపీ పాలనలో కల్తీ మద్యం వల్ల చనిపోయిన 30 వేల మందికి సంబంధించిన కుటుంబాలు ఫిర్యాదు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని, నువ్వు తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్, జీఓ 22ఏ కారణంగా నష్టపోయిన బాధితులందరూ ఫిర్యాదుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అరాచకాలన్నింటినీ ఆధారాలతో సహా అప్లోడ్ చేయడానికి అన్ని వర్గాల ప్రజలు, బాధితులు సిద్ధంగా ఉన్నారన్నారు.

యాప్ పేరుతో అధికారులను భయపెట్టి ప్రభుత్వ పరిపాలనను విచ్ఛిన్నం చేసేందుకు వ్యూహాత్మకంగా కుట్రలకు పాల్పడుతున్నాడంటూ ధ్వజమెత్తారు. వైసీపీ కార్యకర్తల కోసం యాప్ తీసుకొస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వైసీపీ నేతలపై అక్రమ కేసులు పెడుతుందని, కక్షపూరితంగా వ్యవహరిస్తోందని జగన్ పదేపదే చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఎవరిపైనా అక్రమ కేసులు పెట్టడం లేదని, ప్రజలకు దీనిపై పూర్తి స్పష్టత ఉందని అన్నారు. జగన్ తీసుకొచ్చే యాప్లో ఐదేళ్ళ వైసీపీ పాలనలో పంచభూతాలను దోచుకుని చేసిన బాగోతాలను, అరాచకాలను నిక్షిప్తం చేయడానికి బాధితులు సిద్ధంగా ఉన్నారని వివరించారు. నీ పర్యటనల వల్ల ఎవరికి ప్రయోజనమన్నారు. ప్రజల్లోకి వెళ్లి సమస్యలను పరిష్కరించడం మానేసి వారిని చంపేయండి, వీరిని నరికేయండి, రప్పా రప్పా అంటే నీకెందుకు సన్మానాలు, సత్కారాలు చేస్తారు జగన్మోహన్రెడ్డి అంటూ ప్రశ్నించారు. జగన్ పర్యటనలకు ప్రభుత్వం ఎక్కడా ఆంక్షలు విధించడం లేదని, ప్రజల్లో సానుభూతి కోసం జగన్ అబద్ధాలు చెప్పేందుకు ప్రయత్నిస్తున్నాడంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.


**రోజా నోరు అదుపులో పెట్టుకో**

మాజీమంత్రి రోజా వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరంగా ఉన్నాయని, సభ్యసమాజం తలదించుకునేలా నోరు పారేసుకుంటుందని శాప్ ఛైర్మన్ అన్నారు. రోజా కుటుంబం ఎప్పుడైనా ప్రజా సేవ చేసిందా అంటూ మండిపడ్డారు. ఏ రోజైనా మహిళలా ప్రవర్తించావా అంటూ నిలదీశారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి హుందాగా ప్రజాసేవ చేస్తున్నారు కాబట్టే ఆమెకు గౌరవం, అభిమానం, ఆదరణలు లభిస్తున్నాయని, ఏనాడైనా నువ్వు ప్రజాసేవలో గౌరవంగా మెలిగిన సందర్భాలున్నాయా అంటూ గుర్తు చేశారు. నువ్వు ఈరోజు రాజకీయాల్లో ఉన్నావంటే అది సీఎం చంద్రబాబునాయుడు గారు పెట్టిన భిక్షన్నారు. మాట్లాడాలంటే నీకన్నా బలంగా, దారుణంగా మాట్లాడగలమని, కానీ మహిళ అంటే గౌరవముంది కాబట్టే మర్యాదగా మాట్లాడుతున్నామని అన్నారు. మిమ్మల్ని ఐదేళ్లు ఎదుర్కొని, మీ దాడులను తట్టుకుని ఇప్పుడు అధికారంలోకి వచ్చామనే విషయం మరిచిపోవద్దన్నారు.

మీ పాలనలో ప్రజలు విసిగిపోయారని, వారు ఎగిరెగిరి తన్నితే మీ పార్టీకి 11సీట్లు వచ్చాయని గుర్తు చేశారు. నీ వింత చేష్టలు తట్టుకోలేక నగరి ప్రజలే నిన్ను ఎగిరెగిరి తన్ని ఘోరంగా ఓడించి ఇంట్లో కూర్చొబెట్టారన్నారు. నీ చేష్టలను చూస్తున్న రాష్ట్రంలోని మహిళలు నవ్వుకుంటున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ధర్మాసనమే సమర్థించిందని, మీరు చేసే విషప్రచారాలను నమ్మే స్థితిలో ఎవరూ లేరన్నారు. ఏపీకి పరిశ్రమలు రాకుండా వైసీపీ నేతలే అడ్డుపడుతున్నారంటూ శాప్ ఛైర్మన్ మండిపడ్డారు.

ఈ కార్యక్రమంలో తిరుపతి టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్, టీడీపీ నాయకులు రామగోపి, శ్రీనివాస్ యాదవ్, తోట వాసుదేవ, రఫీ, రంజిత్ నాయుడు, కొట్టే హేమంత్ రాయల్, దిలీప్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

# 10 మంది ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేండ్ల జైలు శిక్ష



C.విశ్వనాథన్, D. సేతు, D. రమేష్, M. సంపత్, V. రత్నం, M. బూచాయన్, J. కుమార్, M. సురేష్, C. రామర్


- ఒకొక్కరికి రూ.06 లక్షల జరిమానా
- సంచలన తీర్పు వెల్లడించిన ఎర్రచందనం అక్రమరవాణా నిరోధక ప్రత్యేక ఏడీజే కోర్టు న్యాయమూర్తి

**తిరుపతి, జూలై 31(మనం న్యూస్) :** ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన 10 మంది స్మగ్లర్లు ఒకొక్కరికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ. 06 లక్షల చొప్పున జరిమానా విధిస్తూ ఎర్రచందనం అక్రమరవాణా నిరోధక ప్రత్యేక ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి గారు గురువారం తీర్పు నిచ్చారు. ఎర్రచందనం అక్రమరవాణా నిరోధక హెడ్ ఎల్. సుబ్బారాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ మేరకు ఎర్రచందనం అక్రమరవాణా నిరోధక ఎస్పీ పీ. శ్రీనివాస్ పర్యవేక్షణలో గతంలో నమోదయ్యి, కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. పగడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా క్రైమ్ నెంబరు 59/2019 కేసులో 10 మంది ముద్దాయిలు అరెస్టయ్యారు. వీరు తమిళనాడు లోని తిరువన్నామలై, వేలూరు జిల్లాలకు చెందిన 1. సి. విశ్వనాథన్, 2. డి సేతు, 3. డి. రమేష్, 4. ఎం. సంపత్, 5. వి.రత్నం, 6. ఎం. బూఛాయాన్, 7. జె. కుమార్, 8. సి. ప్రభు 9. ఎం. సురేష్, 10. సి.రామర్ కాగా, వీరు ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పెరుమాళ్లపల్లి బీటు, తిమ్మినాయుడు పాలెం డివిజన్ లో పట్టుబడ్డారు. వీరి నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి 10 మంది స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష తో పాటు రూ. 06 లక్షల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. కోర్టుకు హాజరు కానీ ప్రభు అనే ముద్దాయికి నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. తదుపరి కోర్టు ఆదేశాలు మేరకు 9 మందిని నెల్లూరు సెంట్రల్ జైలులో అప్పగించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ లోని శేషాచలం రిజర్వు ఫారెస్టులో అతి విలువైన సహజ సంపద అయిన ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడమే కాకుండా, అడవిలోకి అక్రమ ప్రవేశం చేసిన నేరస్తులకు కూడా ఇది ఒక హెచ్చరికగా పరిగణించబడుతుందని ఎర్రచందనం అక్రమరవాణా నిరోధక ఎస్పీ పీ. శ్రీనివాస్ తెలిపారు. ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా సహకరిస్తున్న కోర్టు సిబ్బందిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

# తిరుమలలో సోషల్ మీడియా రీల్స్ చిత్రీకరణపై టీటీడీ హెచ్చరిక

**తిరుమల, జూలై 31(మనం న్యూస్) :** తిరుమల శ్రీవారి ఆలయం ముందు, మాడ వీధుల్లో ఇటీవల కొంతమంది వెకిలి చేష్టలు చేస్తూ, నృత్యాలు ప్రదర్శిస్తూ వీడియోలు (రీల్స్) చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో అప్లోడ్ చేస్తున్నట్లు టీటీడీ దృష్టికి వచ్చింది. తిరుమలలాంటి పవిత్రమైన ఆధ్యాత్మిక క్షేత్రంలో ఇలాంటి అభ్యంతరకర ,అసభ్యకర చర్యలు అనుచితం.

భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఈ తరహా చర్యలు ఆధ్యాత్మిక




వాతావరణానికి విఘాతం కలిగిస్తున్నాయి. తిరుమల క్షేత్రం భక్తి, ఆరాధనలకు నిలయమని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. తిరుమలలో కేవలం ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలకే పరిమితం కావాలి. శ్రీవారి దర్శనార్థం వచ్చే లక్షలాది మంది భక్తుల మనోభావాల పట్ల గౌరవం చూపడం ప్రతి ఒక్కరి బాధ్యత.

టీటీడీ విజిలెన్స్, సెక్యూరిటీ సిబ్బంది ఇలాంటి వీడియోలు చిత్రీకరించేవారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించడమైనది. తిరుమల పవిత్రతను భంగం కలిగేలా వ్యవహరించే వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టడం జరుగుతుంది.

తిరుమలలో అసభ్యకర వీడియోలు, వెకిలి చేష్టలతో రీల్స్ చేయకుండా తిరుమలలో ఆధ్యాత్మిక వాతావరణం, పవిత్రతను కాపాడడంలో సహకరించాలని భక్తులకు టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

# పారిశుద్ధ్యం లోపిస్తే కఠిన చర్యలు తప్పవు

- నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య

**తిరుపతి, జూలై 31(మనం న్యూస్) :** అన్నా క్యాంటీన్లలో పారిశుద్ధ్యం లోపిస్తే నిర్వాహకులపై కఠినచర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య హెచ్చరించారు. గురువారం ఉదయం నగరంలో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్లను, ఎమ్మార్ పల్లి లోని యాచకుల సహాయక కేంద్రాన్ని అధికారులతో కలసి పరిశీలించారు. అన్నా క్యాంటీన్లు పరిశుభ్రంగా లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్నా క్యాంటీన్ల నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్లను సక్రమంగా నిర్వహించక పోతే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



క్యాంటీన్లోనికి ఆహార పదార్థాలు తీసుకురాక ముందే పరిసరాలను శుభ్రం చేయాలని అన్నారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. టోకెన్లు ఆన్లైన్ ద్వారానే పంపిణీ చేయాలని, నిర్ణీత సమయంలో ఆహార పదార్థాలు ప్రజలకు అందించాలని అన్నారు. ఆహార పదార్థాలు అందించే వారు ఖచ్చితంగా ధరించాలని, ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని అన్నారు. ప్రతి అన్నా క్యాంటీన్ వద్ద సమయాలను తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. యాచకుల పునరావాస కేంద్రంలో ఉన్న వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.లు, అన్నా క్యాంటీన్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన 'అష్టబంధన మహా సంప్రోక్షణ'




**తిరుపతి, జూలై 31(మనం న్యూస్):** విజయవాడ శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న "అష్టబంధన మహాసంప్రోక్షణ" కార్యక్రమం గురువారం ఉదయం 11.25 నుండి 12.24 గంటల వరకు మహాసంప్రోక్షణతో ఘనంగా ముగిసింది. ఉదయం 7.30 గంటలకు మహా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం ఉదయం 11.25 గంటలకు తులాలగ్నంలో కళావాహనం, ప్రథమ కాలార్చనము, మహా సంప్రోక్షణ, అక్షతారోహణ, బ్రహ్మ ఘోష తదితర కార్యక్రమాలు నిర్వహించి, భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆగమ సలహాదారు శ్రీ భావనారాయణ చార్యులు, కంకణ బట్టర్ మురళీకృష్ణ స్వామి అయ్యంగార్, ఇంజనీరింగ్ అధికారులు నాగభూషణం, సురేంద్రనాథ్ రెడ్డి, జగన్మోహన్, సూపరింటెండెంట్ మల్లికార్జున, టెంపుల్ ఇన్స్పెక్టర్ లలితా రమాదేవి అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# సౌభాగ్యానికి విస్తృత ఏర్పాట్లు: టీటీడీ

**తిరుపతి, జూలై 31(మనం న్యూస్) :** వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఆగష్టు 08వ తేదీ శుక్రవారం రోజున టిటిడి, హిందూ ధర్మప్రచార పరిషత్ సంయుక్తంగా సౌభాగ్యం పేరుతో కార్యక్రమాలు నిర్వహించేందుకు టిటిడి విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. సౌభాగ్యం పూజ సామాగ్రికి తిరుపతిలోని టీటీడీ శ్వేతా



భవనంలోని హాలులో గురువారం టీటీడీ మరియు హిందూ ధర్మప్రచార పరిషత్ అధికారులు, సిబ్బంది, శ్రీవారి సేవకులు ప్రత్యేక పూజలు నిర్వహించి టీటీడీ ఆధ్వర్యంలోని ఆలయాలకు పంపిణీ చేయడానికి పార్శల్ ప్యాకెట్లు సిద్ధం చేశారు. వరలక్ష్మీ వ్రతం రోజున టిటిడి ఆలయాలలో సౌభాగ్యం పేరుతో మహిళలకు గాజులు, పసుపు, కుంకుమ, అక్షింతలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో టిటిడి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 51 ఆలయాలలో సౌభాగ్యవతులకు గాజులు, శ్రీ పద్మావతి అమ్మవారి కుంకుమ ప్యాకెట్లు, కంకణాలు, పసుపు దారాలు, శ్రీ పద్మావతీ అమ్మవారి లక్ష్మీ అష్టోత్తర శత నామావళి పుస్తక ప్రసాదాలను అందించనున్నారు. ఈ సందర్భంగా సుమంగళి ద్రవ్యాలను సౌభాగ్యవతులకు పంపిణీ చేసేందుకు ఓ అజ్ఞాత భక్తుడు ఈ పూజ సామగ్రిని విరాళంగా అందించారు. విరాళంగా అందించిన వాటి వివరాలు ఇలా ఉన్నాయి. 8 లక్షల గాజులు, 1.40 లక్షల కంకణాలు, 1.40 లక్షల పసుపు దారాలు, 1.40 లక్షల అమ్మవారి కుంకుమ ప్యాకెట్లు, అమ్మవారి లక్ష్మీ అష్టోత్తర శత నామావళి పుస్తక ప్రసాదాలను సదరు ఆలయాలకు తరలించారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మప్రచార పరిషత్ సంచాలకులు శ్రీరామ్ రఘునాథ్, అదనపు సంచాలకులు రాంగోపాల్, ఏఈవో శ్రీరాములు, సూపరింటెండెంట్ ఢిల్లీ రెడ్డి, శ్రీవారి సేవకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మంచోనిలా నటించలేను

గాయాలను మోస్తున్నవాడిని,
అంతర్గత చప్పుడుని
పేజీలు పేజీలుగా చదువుతున్నవాడిని,
నీటి బుడగలాంటి జీవితాన్ని
పుస్తకాలుగా కుడుతున్నవాడిని,
మంచోనిగా నటించలేను.

మాటలను మట్టిలో కప్పివేయలేను,
కొన్నిసార్లు నా మాటలు ధాన్యపు గింజలు,
మరికొన్నిసార్లు మీ గొంతుకి ఉరితాళ్లు.
రంగుల తెరలను నోటికి కట్టుకోవడం
చేతకానివాడిని,
గుండెకింద విధ్వంసాన్ని దాచుకోలేనివాడిని,
తడిగుడ్డతో గొంతులు కోయలేనివాడిని,
బహిరంగ నిజాన్ని.

నీడల్లో ఆటలు ఆడనివాడిని,
ఒక మూల కాళ్లు ముడుచుకొని కన్నులను
ఒత్తుకోలేనివాడిని,
నిశీధిలో చంద్రవంకను చూడనివాడిని,
వెలుగుపూలను కొయ్యలేనివాడిని,
నిరంతర చెడ్డవాడిని.

తప్పటడుగులు వేసినవాడిని,
అడుగుల గుర్తుల నుండి విజ్ఞానంగా
ఎదుగుతున్నవాడిని,
చర్మంపై మచ్చలను తుడుచుకున్నవాడిని,
ముక్కుపై సూర్యుణ్ణి నిలుపుకున్నవాడిని,
అద్దంలో ప్రతిబింబాన్ని చెక్కుకుంటున్నవాడిని,
నిక్కచ్చి శిల్పిని.

నిందలను మోసినవాడిని,
తుపుక్కున ఎవరో ఉమ్మితే
అనుభవంగా స్వీకరించినవాడిని,
పాదాల కింద నిప్పులను మోస్తున్నవాడిని,
విసిరిన రాళ్లను
ఆయుధాలుగా మలుచుకుంటున్నవాడిని,
శాశ్వత విమర్శను.
ముమ్మాటికీ
నీ అంతటి మంచోనిలా నటించలేనివాడిని,
నాదో చిన్న అనుమానం
ఇంతకీ!
నీది మంచి నటనేనా!?

**- జాని తక్కెడశిల**
7259511956

# పిల్లలకు తల్లి పాలకు మించిన అమృతం లేదు



'తల్లికి మించిన దైవం లేదు. అమ్మ పాలకు మించిన అమృతం లేదు'. నవమాసాలు గర్భంలో ఉండి, అమ్మ నుండి అందుకున్న తొలి వరం కమ్మనైన క్షీరం. మన దేశంలో ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు జరుగుతాయి.

ఈ సంవత్సరం థీమ్ 'తల్లిపాలు ఇవ్వడానికి ప్రాధాన్యత ఇవ్వడం. స్థిరమైన మద్దతు వ్యవస్థలను సృష్టించడం'. ఈ థీమ్ తల్లిపాలు ఇవ్వడాన్ని ఆచరణాత్మకంగా, అందరి తల్లులకు అందుబాటులో ఉండేలా చేయడానికి దీర్ఘకాలిక, సమానమైన మద్దతు వ్యవస్థలను ఏర్పాటు చేయవలసిన అవసరాన్ని నొక్కి చెబుతుంది. 'పిల్లలు ఆరోగ్యవంతులుగా పెరిగి అభివృద్ధి చెందడానికి తల్లిపాలు సరైనవని' ప్రపంచ ఆరోగ్య సంస్థ , యునిసెఫ్, కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖలు సిఫార్సు చేస్తున్నాయి.

**తల్లి నుండి లభించే తొలి బహుమతి**

'ఆరోగ్యంగా ఉంటే అడవిలోనైనా ఆనందంగా బ్రతికేవచ్చు' అన్నట్లు తల్లి పాలు తాగడం నుండే బిడ్డ ఆరోగ్యం ఆరంభం అవుతుంది. తల్లి పాలివ్వడం అనేది తనకు, తన బిడ్డకు, ప్రపంచానికి తల్లి నుండి లభించే తొలి బహుమతి. ఇది ఎల్లప్పుడూ అందరికీ సులభం కానప్పటికీ ఇది ఎల్లప్పుడూ విలువైనదే. తల్లిపాలు శిశువుకు ప్రకృతి ఇచ్చే సహజ సిద్ధమైన టీకా. ఇవి సహజమైన, పునరుత్పాదక ఆహారం, వ్యర్థాలు, కాలుష్యం లేని వనరు. బిడ్డకు ఈ పాలు ఎంతో శ్రేష్ఠమే కాక, పౌష్టికాహారం కూడా. శిశువుకు తల్లి పాలకు మించిన ఆహారం లేదు, ఉండదు, ఉండబోదు కూడా. ఇవి ప్రోటీన్లు, విటమిన్లు, పిండి పదార్థాలు, కాల్షియం, పొటాషియం, ఖని జాలు, సూక్ష్మపోషకాలు అవసరమైన మేరకు పుష్కలంగా ఉండటం వలన పిల్లలు తగినంత బరువు పెరుగుతారు. వీటిలో శక్తివంతమైన ప్రతిరోధకాలు ఉండటం వల్ల అంటువ్యాధులు, వైరల్ ఇన్ఫెక్షన్లు, అలర్జీలు, ఆస్తమా, చెవి సంబంధిత వ్యాధులు, సెప్సిస్, న్యుమోనియా, డయేరియాల నుండి శిశువును కాపాడతాయి. ఇందులో ఉండే ఫ్యాటీ యాసిడ్స్ బిడ్డ మెదడు పెరుగుదలకు దోహదం చేయడం వలన తెలివితేటలు పెరుగుతాయి. అంతేకాదు, అటెన్షన్ డెఫిసిట్ హైపర్‌ఆక్టివిటీ డిజార్డర్‌ను అభివృద్ధి చేసే అవకాశాలను తగ్గించడమే కాక నరాల అభి వృద్ధిపై సానుకూల ప్రభావాన్ని చూపుతాయి. తల్లిపాలు తేలికగా జీర్ణ మవడం వలన మలబద్ధకం సమస్యలు రాకుండా కాపాడతాయి. భవిష్యత్తులో స్థూలకాయం, అధిక రక్తపోటు, మధుమేహ వ్యాధి రాకుండా ఇవి ఒక రక్షణ కవచంలా పనిచేస్తాయి. 2015-16 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-4 ప్రకారం 6 నెలల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు ప్రత్యేకంగా తల్లిపాలు ఇచ్చే వారు 54.9 శాతం ఉండగా 2019-21 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 వచ్చేసరికి అది 63.7 శాతానికి పెరిగింది. ఇందులో గ్రామీణులు 65.1 శాతం, పట్టణవాసులు 59.6 శాతంగా ఉన్నారు. ఇది ఎంతో శుభపరిణామం.

**తొలి గంట చాలా ముఖ్యం**

బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే తల్లి పాలు ప్రారంభించాలి. ప్రసవం అయిన వెంటనే మొదటి అరగంట నుండి ఒక గంట వ్యవధిలో తల్లి పాలలో కొలొస్ట్రమ్ ఉంటుంది. ఈ పాలు ఎంత తొందరగా తాగించడం మొదలుపెడితే అంత మంచిది. ఇది బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిని పెంచి అనేక వ్యాధులనుండి దూరంగా ఉంచుతుంది. శిశువు జీవితంలోని మొదటి నెలలకు అవసరమైన శక్తిని, పోషకాలను తల్లిపాలు అందిస్తాయి. బిడ్డకు ఆరునెలలు పూర్తయ్యేవరకూ తల్లిపాలు మాత్రమే పట్టాలి. ఈ ఆరు నెలలు చాలా కీలకం. ఆరు నెలల తర్వాత అనువైన కుటుంబ ఆహారాన్ని అదనంగా ప్రారంభించాలి.

తల్లిపాలు రెండు సంవత్సరాల వయస్సు వరకు లేదా వీలైనంత కాలం ఇవ్వాలి. తల్లి పాలల్లో ఎనభై శాతం కంటే ఎక్కువ నీరు ఉంటుంది. తల్లి తన బిడ్డకు దాహం వేస్తున్నట్లు అనిపించినప్పుడల్లా పాలివ్వవచ్చు. వేడి వాతావరణంలో కూడా ఆరు నెలల వయస్సు లోపు పిల్లలకు నీరు అవసరం లేదు. ఆరు నెలల తరువాత తల్లి పాలతో పాటు పరిపూర్ణమైన ఆహారాన్ని అందించడం మొదలు పెట్టవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసింది. డాక్టర్ సలహా మేరకు విటమి న్లు, మినరల్స్, సిరప్‌లను ఇవ్వొచ్చు. అదనపు ఆహా రంతో పాటు కనీసం రెండేళ్లు తల్లి పాలు పట్టాలి. తల్లికి, పాలు తాగే బిడ్డకు ఎలాంటి సమస్య రానంత వరకూ, తల్లి మరల గర్భంతో ఉ న్నా కూడా బిడ్డకు పాలు ఇవ్వ వచ్చు. ఆ తరువాత తల్లీ బిడ్డలకు ఇష్టమైనంతవరకూ తల్లిపాలు పెట్టవచ్చు.

**తల్లిపాలు తాగని పిల్లలకి వచ్చే నష్టాలు**

తల్లి పాలు మాత్రమే తాగే పిల్లలు ప్రాణాంతక వ్యాధులతో మరణించే అవకాశం తక్కువ అని అంతర్జాతీయ నివేదికలు చెబుతున్నాయి. ఈ విధంగా తల్లి పాలు కొనసాగించకపోవడం వలన కలిగే నష్టాలపై మన దేశంలో జరిపిన అంతర్జాతీయ అధ్యయనంలో, ప్రతి సంవత్సరం నీళ్ల విరేచనాలు, న్యుమోనియా లతో సుమారు ఒక లక్ష మంది 5 సంవత్సరాలలోపు పిల్లలు మరణిస్తున్నారు. ప్రతి ఏటా 34.7 కోట్ల మంది పిల్లలు నీళ్ల విరోచనాలకు, 0.24 కోట్ల మంది పిల్లలు న్యుమోనియా జబ్బులకు, 40,382 మంది పిల్లలు స్థూలకాయానికి లోనవుతున్నారు.

**చాలా లాభాలు**


బిడ్డకు పాలివ్వడం వలన తల్లికి కూడా లాభాలున్నాయి. ప్రసవంలో తల్లి బరువు ఎక్కువ పెరుగుతుంది. పాలివ్వడం వలన బరువు తగ్గుతారు. రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్, రక్తపోటు, టైప్ 2 మధుమేహం వంటి రోగాలు భవిష్యత్తులో రాకుండా అడ్డుకుంటాయి. ప్రతి ఏటా 7,000 మంది తల్లులు రొమ్ము క్యాన్సర్, 1,700 మంది అండాశయ క్యాన్సర్, 87,000 మంది మధుమేహం బారిన పడుతున్నారు. పిల్లలు పుట్టిన తరువాత తమ శిశువులకు పాలిచ్చే తల్లులు ఎక్కువగా ఉండే దేశం క్రొయేషియా. ఇక్కడ 98 శాతం మంది తల్లులు తమ బిడ్డలకు పాలిస్తున్నారు. ఇంకా రువాండా, చిలీ, బురుండి వంటి దేశాలలో 80 శాతం కంటే ఎక్కువ మంది తల్లులు తమ పిల్లలకు పాలిస్తున్నారు.

**ప్రత్యామ్నాయం లేదు**

ప్రకృతి ప్రసాదించిన గాలినే పీల్చుతాం. ప్రకృతి అందించిన నీటినే తాగుతాం. వీటికి ప్రత్యామ్నాయంగా ఇంకేమైనా తీసుకోగలమా? అలానే తల్లి పాలకు కూడా ఇంకో ప్రత్యామ్నాయం లేదు.

విదేశాల నుండి తీసుకొచ్చిన పాల పొడులు కూడా అమ్మ పాలకు మించి పోవు. తల్లులందరూ బాగా ఆలోచించాలి. పిల్లలకు పెద్దయిన తరువాత ఆస్తులు, అంతస్తులు, డబ్బు ఇవ్వాలనుకుంటారు. కానీ వాటి కంటే పిల్లలకు ఇచ్చే మొదటి ఆస్తి తల్లిపాలే అన్న విషయం గుర్తెరగాలి. కొన్ని పరిస్థితులలో, అనగా ఉద్యోగరీత్యా బయట పనులు చేయడం వలన తల్లులు తమ శిశువుకు పాలు అందివ్వలేరు. ప్రభుత్వ ఉద్యో గం చేస్తున్న వారికి ప్రసవానంతర సెలవులు ఇస్తున్నారు. అలానే ప్రైవేటు రంగంలో కూడా కనీసం ఆరు మాసాలు వేతనంతో కూడిన సెలవివ్వాలి. పాలిచ్చే అమ్మ పొలం పనులకు, కూలీ పనులకు ఆ ఆరు మాసాలు వెళ్లకుండా ఇంటిలోని యజమానులు, కుటుంబసభ్యులు సహకరించాలి.ఈ దిశగా మనమందరం సమాజంలో అవగాహన కల్పించడంలో పాలుపంచుకోవాలి.

**(ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు)**



**- కింజరాపు అమరావతి**
82472 86357

# మన మౌనం.. దేనికి సంకేతం!!?



గాజాలో ఇజ్రాయెల్ నరమేధానికి పాల్పడుతున్నది. వృద్ధులు, చిన్నారులు, మహిళలు అనే తేడా లేకుండా ప్రజలను హత్య చేస్తున్నది. ఇరవై నెలల కాలంలోనే 60 వేల మందిని పొట్టన బెట్టుకున్నది. అయితే ఇజ్రాయెల్ చేస్తున్న నరమేధానికి భారతదేశానికి చెందిన పలు కార్పొరేట్ కంపెనీల సహకారం ఉందనే తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. జేఎన్‌యూ, ఏఎంయూ, హైదరాబాద్ యూనివర్సిటీలతోపాటు బెంగుళూరు, ముంబైలోని చాలా విద్యాసంస్థల్లో, అనేక ప్రధాన నగరాల్లో ఈ కంపెనీలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆయా కంపెనీల ఆఫీసుల ఎదుట సైతం ప్రొటెస్ట్స్ సైతం చేస్తున్నారు. ఆయా కంపెనీల ఉత్పత్తులను బాయ్ కాట్ చేయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. అయితే ఇలాంటి ఆరోపణలపై ఆయా కంపెనీలు స్పందించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. సైలెన్స్ దేనికి సంకేతం అనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. మౌనం అర్ధాంగీకారమేనా? అనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

ఇజ్రాయెల్, అక్కడి కంపెనీలతో వ్యాపార సంబంధాలు కలిగి, గాజా నరమేధానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకారమందిస్తున్నారని భారత దేశానికి చెందిన కొన్ని కార్పొరేట్ కంపెనీలపై ప్రధానంగా ఇలాంటి ఆరోపణలు వస్తున్నాయి. అందులో టాటా గ్రూప్, అదానీ గ్రూప్, రిలయన్స్ ఇండస్ట్రీస్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారత్ ఫోర్జ్, మ్యూనిషన్స్ ఇండియా లిమిటెడ్ వంటి సంస్థలు ఉన్నాయి. ఆయా కంపెనీలు ఇజ్రాయెల్, అక్కడి స్థానికత కలిగిన కంపెనీలతో వ్యాపార సంబంధాలు కలిగి ఉన్నాయి. ఈ కంపెనీలు ఇజ్రాయెల్‌కు గాజాలో నరమేధానికి వాహనాలు, డ్రోన్స్, డిఫెన్స్ పరికరాలు వంటి వాటిని సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా సాంకేతిక, సైబర్ సెక్యూరిటీ సేవలు సైతం అందిస్తున్నట్లు సైతం విమర్శలు ఉన్నాయి.

గాజా నరమేధంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకారమందిస్తున్నట్లు తీవ్రమైన ఆరోపణలు ఉన్నా ఆయా కంపెనీలు స్పందించడం లేదు. కనీస స్పష్టత ఇవ్వడం లేదు. తాము గ్లోబల్ మార్కెట్‌లో ఉంటున్నందున ఇజ్రాయెల్‌తో, అక్కడి కంపెనీలతో తమ వ్యాపార సంబంధాలు సాధారణ వాణిజ్య కార్యకలాపాల్లో భాగమేనని ఆయా కంపెనీలు భావిస్తూ ఉండవచ్చు. అయితే ఈ అంశంపై బహిరంగంగా స్పందించడం ద్వారా వ్యాపార ఒప్పందాలకు ఆటంకం కలుగుతుందని ఆయా కంపెనీలు భయపడుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి.

జెనోసైడ్‌లో ఇజ్రాయెల్‌కు సహకారమందిస్తున్నారనే ఆరోపణలు వచ్చిన వాటిల్లో భారత్‌కు చెందిన టాప్ కంపెనీలు ఉన్నాయి. ఆయా కంపెనీల్లో కోట్లాది మంది తమ నగదును పెట్టుబడిగా పెట్టి ఇన్వెస్టర్లుగా మారారు. అంతేకాకుండా కోట్లాది మంది ఆయా కంపెనీల ఉత్పత్తులను వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా కంపెనీలు తమ ఇన్వెస్టర్లు, వినియోగదారులకు జవాబు చెప్పాల్సిన అవసరం లేదా అనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. అయితే బహిరంగంగా ట్రేడ్ చేసే సంస్థలు పారదర్శకతను పాటించాల్సి ఉంటుంది. అంతేకాకుండా బాధ్యత కలిగిన వ్యాపార సంస్థలుగా తమను తాము చెప్పుకునే ఈ కంపెనీలు తమపై వచ్చిన ఆరోపణలకు కచ్చితంగా జవాబు చెప్పాల్సి ఉంటుంది. తద్వారా ఇన్వెస్టర్ల నమ్మకాన్ని కాపాడుకోవాలి. మరోవైపు ఈ ఆరోపణలు చట్టపరమైన ఫిర్యాదులుగా మారితే, ఆయా కంపెనీలు తమ వ్యాపార కార్యకలాపాలను బహిరంగంగా లేదా చట్టపరమైన వేదికలపై చెప్పాల్సిన అనివార్య పరిస్థితి నెలకొంటుంది.

ఇజ్రాయెల్ సైనిక చర్యలను నరమేధంగా ఆరోపిస్తూ.. బాయ్‌కాట్ , డైవెస్ట్ మెంట్, శాంక్షన్స్ (బీడీఎస్) ఉద్యమం ప్రపంచవ్యాప్తంగా బలపడుతున్నది. భారత కంపెనీలకు సంబంధించి కూడా దేశంలో నిరసనలు జరుగుతున్నాయి. టాటా గ్రూప్ ఇజ్రాయెల్‌కు ఆయుధాలు సరఫరా చేస్తున్నదని ఆరోపిస్తూ కేరళలోని కోజికోడ్‌లో ఎస్ఐఓ కార్యకర్తలు టాటా గ్రూప్‌నకు చెందిన జూడియో స్టోర్ ఎదుట నిరసన తెలిపారు. ఢిల్లీలోని కమలానగర్‌లో కూడా జూడియో స్టోర్ వద్ద 'ఇండియన్ పీపుల్ ఇన్ సాలిడారిటీ విత్ పాలస్తీన్' అనే పేరుతో నిరసనలు జరిగాయి. అంతేకాకుండా టాటా, రిలయన్స్, అదానీ, మహీంద్రా గ్రూప్ కంపెనీలకు చెందిన ఉత్పత్తులను బహిష్కరించాలని సోషల్ మీడియాలో అనేక మంది పిలుపునిస్తున్నారు.

బాయ్‌కాట్ మూవ్ మెంట్ అనేది ప్రస్తుతం ఆయా కంపెనీలపై ఆర్థికంగా అంతగా ప్రభావం చూపెట్టడం లేదు. అయితే రిటైల్ స్టోర్ల వద్ద క్రమంగా నిరసనలు పెరిగితే.. వినియోగదారుల విశ్వాసం దెబ్బతినొచ్చు.ప్రతికూల ప్రచారం కంపెనీల బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీయొచ్చు. మధ్యప్రాచ్య దేశాల్లో ఆయా కంపెనీలకు ఉన్న వ్యాపార సంబంధాలు, ఒప్పందాలపైనా ఎఫెక్ట్ పడొచ్చు. ఫలితంగా భవిష్యత్తులో ఆయా కంపెనీలు నష్టపోయే ప్రమాదమున్నది. ఇందుకోసం ఇన్వెస్టర్ల నమ్మకాన్ని కాపాడేలా ఆయా కార్పొరేట్ కంపెనీలు తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్), ఎన్విరాన్మెంటల్ సోషల్ గవర్నెన్స్ (ఈఎస్‌జీ) ప్రమాణాలకు అనుగుణంగా పారదర్శకంగా వ్యవహరించాలి. కేవలం లాభాల కోసమే కాకుండా.. మానవతా విలువలకు అనుగుణంగా ఈ ఆరోపణలపై స్పష్టతనివ్వాలి.



**- ఫిరోజ్ ఖాన్**

# అత్యంత ప్రమాదకర క్యాన్సర్



క్యాన్సర్ వ్యాధి అంటేనే భయపడతాం. క్యాన్సర్ వ్యాధికి పూర్తి చికిత్స పద్ధతులు లేవవి కంపించి పోతాం. క్యాన్సర్ వ్యాధుల్లో విస్తృత మైనదిగానే కాకుండా ప్రాణాంతకమైనదిగా ఊపిరితిత్తుల లేదా లంగ్ క్యాన్సర్‌ను గుర్తించారు.

తొలుత వ్యాధి లక్షణాలు కనుపించకపోవడంతో అంతిమ దశలో నిర్ధారణ జరిగి ప్రాణాంతక దుస్థితికి చేరుతుంది. ఊపిరితిత్తుల క్యాన్సర్ పట్ల అవగాహన కొరవ డడం, ఆలస్యంగా రోగ నిర్ధారణ జరగడం, నివా రణ మార్గాలను ప్రచారం చేయడం, ఈ వ్యాధి పట్ల పలు అపోహలు చక్కర్లు కొట్టడంతో దీని పట్ల సంపూర్ణ కనీస జ్ఞానం కలిపించడానికి ప్రతి ఏట ఆగస్టు 1 న ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినం (వరల్ లంగ్ క్యాన్సర్ డే) పాటించడం 2012 నుంచి ఆనవాయితీగా మారింది. ప్రపంచ ఊపిరి తిత్తుల క్యాన్సర్ దినం-2025 ఇతివృత్తంగా యునైటెడ్ బై యూనిక్ అనబడే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు.

**ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు కారణాలు**

ఊపిరితిత్తుల కణజాలం అపరిమితంగా, నియంత్రణ కోల్పోయి పెరడంతో గడ్డలు ఏర్పడడాన్ని లంగ్ క్యాన్సర్ అని పిలుస్తూ, ఈ గడ్డలు ఇతర శరీర భాగాలకు వ్యాపించడం కూడా గమనించారు. ప్రపంచవ్యాప్తంగా పలు రకాలైన క్యాన్సర్లలో ఊపిరితిత్తుల క్యాన్సర్ వల్లనే అధిక మరణాలు నమోదు అవుతున్నాయి. ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధికి ప్రధాన కారణం స్మోకింగ్ లేదా పొగతాగడాన్ని గుర్తించారు. ఫస్ట్ హాండ్ లేదా సెకండ్ హాండ్ స్మోకింగ్ లేదా ప్రత్యక్ష, పరోక్షంగా పొగ తాగడంతో పాటు పలు ఇతర కారణాల వల్ల కూడా లంగ్ క్యాన్సర్ రావచ్చు. దీర్ఘకాలం పాటు కలుషిత గాలి పోల్చడం, పని ప్రదేశంలోఆజ్బెస్టాస్/డిజిల్/సిలికా/ఆర్సనిక్/రెడాన్ వాయువు లను పీల్చడం, జన్యుపరంగా తల్లితండ్రుల నుంచి పిల్లలకు సోకడం లాంటి కారణాలతో కూడా ఊపిరితిత్తుల క్యాన్సర్ రావచ్చు.

**ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధి లక్షణాలు,**

ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధిగ్రస్థుల్లో దగ్గు, ఛాతి నొప్పి, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, శ్వాస ఆడకపోవడం, దగ్గినపుడు రక్తం పడడం, అలసిపోవడం, బలహీనత, గొంతు బొంగురు పోవడం లేదా కఠ స్వరం మారడం, మెడ వాపు, ఎముకల నొప్పి, న్యుమోనియా, బ్రాంకైటిస్ లాంటి పలు రోగ లక్షణాలు బయట పడతాయి.

ఊపిరి తిత్తుల క్యాన్సర్ వ్యాధి నిర్ధారణకు ఎక్స్-రే, సిటీస్కాన్,పిఈటి-సిటీ స్కాన్, బ్రాంకోస్కోపీ, బయాప్సీ, స్పూటమ్ సైటాలజీ లాంటి పరీక్షలు చేస్తారు. ఊపిరితిత్తుల క్యాన్సర్ చికిత్స మార్గాల్లో సర్జరీ, కీమోథెరపీ, రేడియోథెరపీ, ఇమ్యూనోథెరపీ, పలుఅత్యాధునిక డిజిటల్ టెక్నిక్స్‌ను వినియోగిస్తున్నారు.

**ఊపిరితిత్తుల క్యాన్సర్ నివారణ మార్గాలు**

పొగ తాగడం ప్రధాన కారణంగా గుర్తించబడిన ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధి పొగ తాగని వ్యక్తులకు కూడా రావచ్చు. పొగ తాగడమనే దురవాటుకు దూరంగా ఉండడంతో పాటు త్వరగా తొలి దశలోనే నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం, కలుషిత గాలి పేల్చకుండా చూసుకోవడం, పని ప్రదేశంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం లాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

తొలి దశలో గుర్తించి ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధిని చికిత్సతో నయం చేయవచ్చు. వ్యాధి నిర్ధారణ అయిన సందర్భంలో తగిన చికిత్సలు తీసుకోవాలి.

క్యాన్సర్ అంటే సత్వర మరణం కాదని, క్యాన్సర్‌కు కూడా చికిత్స ఉందని ధైర్యంగా ఎదుర్కొని వైద్యం చేయించుకోవాలి.

**(1 ఆగస్టు ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినం)**

**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# భారత ఆధునిక జీవశాస్త్ర పితామహులు భార్గవ

పుష్ప మిత్ర భార్గవ ( ఫిబ్రవరి 22, 1928 - ఆగస్టు 1, 2017) (పి.ఎం.భార్గవ) భారత దేశపు అగ్రశ్రేణి శాస్త్రవేత్తలలో ఒకరు. సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ వ్యవస్థాపక డైరెక్టర్. భారత దేశ ఆధునిక జీవశాస్త్ర వాస్తుశిల్పిగా ప్రసిద్ధి చెందారు.

భారత దేశంలో బయోటెక్నాలజీ రంగంలో మార్గదర్శకుడు మరియు 'జెనెటిక్ ఇంజనీరింగ్' అనే పదాన్ని ఉపయోగించిన మొదటి వ్యక్తులలో ఒకరు. 70 వ దశకంలో బయో టెక్నాలజీ విభాగం ఏర్పాటులో భార్గవ కీలక పాత్ర పోషించారు. ఆయన హైదరాబాదులో మెడికల్ అవేర్ మరియు రెస్పాన్సిబుల్ సిటిజన్స్ ఛైర్మన్ కూడా. భార్గవ 1928 ఫిబ్రవరి 22 న అజ్మీర్ (రాజస్థాన్)లో ఒక మధ్య తరగతి కుటుంబంలో, వైద్యుడు, ప్రజారోగ్య నిపుణుడైన రామ్ చంద్ర భార్గవ, గాయత్రి దంపతులకు జన్మించారు. 29ఏళ్ళప్రాయంలో కుటుంబం వారణాసికి మారగా, నేరుగా తొమ్మిదవ తరగతికి నేరుగా బెసెంట్ థియోసాఫికల్ స్కూల్లో చేరారు. పాఠశాల తర్వాత, అతను ఆ సమయంలో ఉత్తర ప్రదేశ్‌లోని ఉత్తమ సంస్థలలో ఒకటైన క్వీన్స్ కాలేజీ నుండి ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. 1944లోబీఎస్సీ ఫిజిక్స్,కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్‌తో, 1446లో ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఎమ్మెస్సీ అలాగే 1949 లో 21 సంవత్సరాల వయస్సులో సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీలో పీ హెచ్ డీ పూర్తి చేశారు. ఆ తర్వాత హైదరాబాద్‌కు వచ్చి 1950 నుంచి 1953 మధ్య కాలంలో ప్రస్తుతం ఉన్న ఐఐసీటీలో, ఉస్మానియా యూనివర్సిటీలో పరిశోధకుడిగా పనిచేశారు. తర్వాత 1953 నుంచి 56 వరకు అమెరికా వెళ్ళి అక్కడి యూనివర్సిటీ ఆఫ్ విస్కానిసన్, మెడిసన్లో ప్రఖ్యాత శాస్త్రవేత్త హెడెల్ బర్గర్‌తో కలిసి విస్తృతమైన పరిశోధనలు చేశారు. 1956-57 వరకు లండన్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ రిసెర్చ్‌లో పనిచేసి, 1977లో ఇండియాకు వచ్చి తిరిగి హైదరాబాద్‌లోని సెంట్రల్ లాబొరేటరీస్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్‌లో చేరారు. తర్వాత ఐఐసీటీలో పనిచేస్తూనే, ఆధునిక జీవశాస్త్ర విభాగాలలో పరిశోధన సంస్థ అయిన హైదరాబాద్ సెంటర్ ఆఫ్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీని స్థాపించారు.

1977 ఏప్రిల్ 1న అది సెమీ అటానమస్ కేంద్రంగా స్థాపించ బడింది. 1990లో డైరెక్టర్ పదవి నుంచి రిటైర్ అయ్యారు. భార్గవ యునైటెడ్ స్టేట్స్, యునైటెడ్ కింగ్డమ్, ఫ్రాన్స్, జర్మనీలలో పనిచేశారు. 50 కి పైగా దేశాలలో పర్యటించారు.

భార్గవ భారత ప్రభుత్వ విధానాల గురించి బాగా తెలిసిన వ్యక్తి. నేషనల్ నాలెడ్జ్ కమిషన్‌లో వైస్ ఛైర్మన్ పదవిని పొందారు. జాతీయ భద్రతా సలహా మండలిలో సభ్యుడిగా, భారత ప్రభుత్వ జెనెటిక్ ఇంజనీరింగ్ అప్రైజల్ కమిటీలో భారత సుప్రీంకోర్టు నామినీగా పనిచేశారు. భార్గవ చాలా కాలంగా సైన్స్ మరియు హేతుబద్ధతను ప్రోత్సహించడంలో, మూఢనమ్మకాలను వ్యతిరేకించడంలో పాలు పంచు కున్నారు. 1946 లో శాస్త్రవేత్తల ట్రేడ్ యూనియన్‌గాస్థాపించబడిన అసోసియేషన్ ఆఫ్ సైంటిఫిక్ వర్కర్స్ ఇన్ ఇండియాతో సంబంధం కలిగి ఉన్నారు. 1976లో 42 వ రాజ్యాంగ సవరణలో భారతదేశ పౌరుల ప్రాథమిక విధిగా శాస్త్రీయ స్వభావాన్ని పొందు పరచడంలో ముఖ్యమైన పాత్ర పోషించారు.

అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన మాలిక్యులర్ బయాలజిస్ట్ గా ఆయన అందించిన సేవలకు గాను 1986లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది. భార్గవ 100 కి పైగా జాతీయ మరియు అంతర్జాతీయ గౌరవాలు, పురస్కారాలను అందుకున్నారు.

భార్గవ వేలాది ఉపన్యాసాలు ఇచ్చారు. 550 కి పైగా ప్రముఖ వ్యాసాలు, ఆరు పుస్తకాలు రాశారు. 125 కి పైగా శాస్త్రీయ పత్రాలను ప్రచురించారు.

హైదరాబాదు లోని ఉప్పల్‌లోని ఐదు అంతస్తుల నివాసంలో ఒక అంతస్తును పరిశోధనకు, మరో అంతస్తును లైబ్రరీకి కేటాయించారు. ఇటీవల వరకూ ఆయన అనేక ఫార్మా కంపెనీలకు సలహాదారుగా పని చేశారు. ఆయన సంభవన ట్రస్ట్, భోపాల్, మరియు ప్రాథమిక పరిశోధన, విద్య మరియు అభివృద్ధి సంఘం, న్యూఢిల్లీలో 2005 మరియు 2007 మధ్య నేషనల్ నాలెడ్జ్ కమిషన్ వైస్ ఛైర్మన్గా పనిచేశారు. బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడ్డాక దేశ వ్యాప్తంగా అసహనం, దళితులపై దాడులు పెరిగి పోతున్నాయని నిరసన వ్యక్తం చేస్తూ.. 2016లో పద్మభూషణ్ అవార్డును వెనక్కి ఇస్తున్నట్టు ప్రకటించారు.



భారత ప్రభుత్వం విశ్వ విద్యాలయాలలో అకడమిక్ కోర్సులను ప్రవేశపెట్టాలని మరియు జ్యోతిష శాస్త్రంలో సైన్స్ డిగ్రీలను అందించాలని నిర్ణయిం చుకుంది. దీనిని వ్యతిరేకిస్తూ ఒక రిట్ పిటిషన్ దాఖలు చేశారు. రాతపూర్వక పిటిషన్‌ను ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు తోసిపుచ్చింది. జస్టిస్ సిన్హా ఈ మెరిట్‌లెస్ పిటిషన్‌ను కోర్టుకు తీసుకు వచ్చి నందుకు ఎలాంటి శిక్షా ఖర్చులు విధించలేదు.

భార్గవ కూడా సుప్రీం కోర్టులో సంబంధిత మం త్రిత్వ శాఖను ప్రజా ప్రయోజన వ్యాజ్యం ద్వారా సవాలు చేశారు. దీనిని భారత అత్యున్నత న్యాయ స్థానం కూడా తోసిపుచ్చింది. పదవులు చేపట్టడానికి ఎప్పుడూ భయపడని, అధికారానికి ఎప్పుడూ తలవంచని, నచ్చని విషయాలను వ్యతిరేకించే వ్యక్తిత్వం ఉన్న పుష్ప మిత్ర భార్గవ ఆగస్టు1,2017 న హైదరాబాదులో మరణించారు.

**(ఆగస్టు 1న పుష్ప మిత్ర భార్గవ వర్ధంతి)**

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# ఉత్పత్తి ఎగుమతులకు దేశ వ్యాప్తంగా 65 సౌలభ్య కేంద్రాలు

**కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి సుశ్రీ శోభ కరంద్లాజే వెల్లడి**

**ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అడిగిన ప్రశ్నకు లిఖిత పూర్వకంగా సమాధానం**



**ఢిల్లీ, జూలై 31(మనం న్యూస్):** సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఇ)లకు ఎగుమతి సహకారం అందించేందుకు దేశ వ్యాప్తంగా ఇప్పటివరకు 65 ఎగుమతి సౌలభ్య కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు గురువారం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అడిగిన ప్రశ్నకు కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి సుశ్రీ శోభ కరంద్లాజే లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఈ కేంద్రాల ద్వారా ఎం.ఎస్.ఎం.ఈ. ల కు ఎగుమతి పథకాలపై అవగాహన, శిక్షణా కార్యక్రమాలు, డాక్యుమెంటేషన్లో సహాయం అందిస్తోందని కేంద్రమంత్రి వెల్లడించారు.దేశవ్యాప్తంగా 2022-23లో 2,865, 2023-24లో 4,727, 2024-25లో 3,630 ఎం.ఎస్.ఎం.ఈ. లు ఎగుమతి సౌలభ్య కేంద్రాల ద్వారా మద్దతు పొందాయన్నారు. ఆంధ్రప్రదేశ్లో 2024-25లో 50 ఎం.ఎస్.ఎం.ఈ లకి ఈ కేంద్రాల ద్వారా మద్దతు లభించింది. ఎం.ఎస్.ఎం.ఈ ల కోసం ఎగుమతులపై అవగాహన కల్పించేందుకు ఈ కేంద్రాలు తరచూ శిక్షణా కార్యక్రమాలు, వర్క్షాప్లు నిర్వహిస్తున్నట్లు వివరించారు.. 2022-23లో 127, 2023-24లో 186, 2024-25లో 180 కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు . ఆంధ్రప్రదేశ్లో 2024-25లో ఒక శిక్షణ కార్యక్రమం జరిగింది. ప్రత్యేక నిధుల కేటాయింపు లేకుండా మంత్రిత్వ శాఖ ఫీల్ ఆఫీసుల ద్వారానే ఈ కేంద్రాలు నడుస్తున్నాయని మంత్రి తెలిపారు. ఎగుమతులపై ప్రత్యేక గణాంకాలు లేనప్పటికీ, ఎం.ఎస్.ఎం.ఈ ల సామర్థ్యం పెరగడానికి ఇవి తోడ్పడుతున్నాయని కేంద్రమంత్రి సుశ్రీ శోభ కరంద్లాజే పేర్కొన్నారు.

# ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా చేతుల మీదుగా..

- **ఎన్టీఆర్ జిల్లా ట్రాఫిక్ విభాగానికి డ్రోన్స్**





**విజయవాడ సెంట్రల్, జూలై 31(మనం న్యూస్):** పోలీసు కమిషనర్ వారి కార్యాలయం నందు పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు ఐ.పి.ఎస్. ఆధ్వర్యంలో టెక్నాలజీ ఆధారిత ట్రాఫిక్ పోలీసింగ్ను మరింత బలోపేతం చేసేలా ఎన్.టి.ఆర్ జిల్లా ట్రాఫ్ఫిక్ విభాగానికి డ్రోన్లు, మోటార్ వాహనాలను, బ్యాటన్లు, ఇతర ట్రాఫిక్ పరికరాలు అంధించే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా పాల్గొన్న రాష్ట్ర డి.జి.పి. హరీష్ కుమార్ గుప్తా ఐ.పి.ఎస్. వారి చేతుల మీదుగా ఎన్.టి.ఆర్. జిల్లా ట్రాఫిక్ విభాగానికి 14 డ్రోన్ కెమెరాలను, 350 బ్యాటన్ లైట్స్ లను,720 కాకి క్యాప్స్ లను అంధించడం జరిగింది. అనంతరం రాష్ట్ర డి.జి.పి. 40 ట్రాఫిక్ పెట్రోలింగ్ మోటార్ వాహనాలను పచ్చ జెండా ఊపి ప్రారంబించారు. ఈ నేపథ్యంలో ముఖ్య అతిది రాష్ట్ర డి.జి.పి. హరీష్ కుమార్ గుప్తా సాంకేతిక పరిజ్ఞానంను ఆయుధంగా చేసుకుని ఎన్.టి.ఆర్ పోలీసు కమిషనరేట్ సాంకేతిక పరిజ్ఞానంలో దేశానికే తలమానికంగా నిలిచిందన్నారు. స్మార్ట్ గా వ్యవహరిస్తూ టెక్నాలజీని ఉపయోగించి విజయవాడ సిటీ ట్రాఫిక్ ను, నేరాలను నియంత్రణ చేయడంలో పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు పని తీరు బాగుందన్నారు. డ్రోన్ ల వినియోగం లో ఎన్.టి.ఆర్.పోలీసు కమిషనరేట్ రాష్ట్రం లో ప్రథమ స్థానంలో ఉందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. ఎన్.టి.ఆర్.జిల్లా అధికారులు మరియు సిబ్బంది చాలెంజ్ గా తీసుకుని పని చేస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణ లో అస్త్రం టూల్ ఉపయోగించడం ద్వారా మంచి ఫలితాలు వచ్చాయి. ఇంటర్ నేషనల్ యోగా డే సందర్భంగా విశాఖపట్నం లో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో అస్త్రం టూల్ ఉపయోగించి ట్రాఫ్ఫిక్ నియంత్రించడంతో ఎక్కడా ఏచిన్న సంఘటన లేకుండా విజయవంతం అయ్యింది. ఇది రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తాం. విజయవాడ లో ట్రాఫిక్ జాబ్ అనేది చాలా టఫెస్ట్ జాబ్, ఉదయం నుండి రాత్రి వరకు నిలబడి ట్రాఫిక్ ను నియంత్రించాలి, కాలుష్యం, ఎండ, వాన లు లెక్క చేయకుండా విధులు నిర్వహిస్తున్నారు. చాలా అంశాల్లో ఎన్.టి.ఆర్ జిల్లా పోలీసులు పని తీరు అంధరికి ఆదర్శంగా ఉంది. సిసి కెమెరాలు, డ్రోన్ ల ద్వారా నేరాలు చాలా వరకు తగ్గాయి అని తెలియజేశారు. విజయవాడ ట్రాఫిక్ పోలీసులు ఆంధ్రపదేశ్ కు ఒక రోల్ మోడల్ గా నిలుస్తున్నారు. అన్నీ జంక్షన్లలో ఏ.ఐ.ఆధారిత ట్రాఫిక్ సింగ్నల్ లైట్స్ లను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో నగర పోలీసు కమిషనర్ రాజశేఖర బాబు మాట్లాడుతూ ఎన్.టి.ఆర్.పోలీసు కమిషనరేట్ కు ప్రభుత్వం, దాతల సహకారంతో పలు సాంకేతిక పరమైన పరికరాలను కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే ప్రతి లా అండ్ ఆర్డర్ పోలీసు స్టేషన్ కు ఒక డ్రోన్ ఇవ్వడం జరిగింది. వాటిని ఉపయోగించి పలు అసాంఘిక కార్యకలాపాలను గుర్తించి వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరిగింది. ఇప్పుడు రాష్ట్ర డి.జి.పి. హరీష్ కుమార్ గుప్తా ఐ.పి.ఎస్. చేతుల మీదుగా ట్రాఫిక్ విభాగానికి 14 డ్రోన్స్ లను అంధిచడం జరిగింది. ట్రాఫిక్ నియంత్రణ లో అస్త్రం టూల్ ద్వారా సరి కొత్త పనితీరు ఉంటుంది. కమిషనరేట్ పరిధిలో ప్రతి గ్రామంలో సి.సి.కెమెరా ఉండేలాగా వేలసంఖ్యలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ఆధునిక టెక్నాలజీ ఉపయోగించడం వలన ట్రాఫిక్ నియంత్రణ తోపాటు, నాలుగు కీలక దొంగ తనాల కేసులను చేధించాం, ఇప్పుడు డ్రోన్ ల ద్వారా ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిస్తాం, డ్రోన్స్ వినియోగం కోసం ప్రత్యేకంగా కొంతమంది సిబ్బందికి శిక్షణ ఇచ్చాం, ఈ డ్రోన్ల ను కమాండ్ కంట్రోలు కు అనుసంధానం చేశాం, అన్ని చోట్ల సిసి కెమెరాలతో రాంగ్ డ్రైవింగ్ ను గుర్తుంచలేం, ఇటువంటి ప్రాంతాలు తో పాటు, వారధి, బ్యారేజి వంటి ప్రాంతాల్లో డ్రోన్ల పని తీరు తో మంచి ఫలితాలు ఉంటాయి. ట్రాఫిక్ పెట్రోలింగ్ వాహనాలు,14 డ్రోన్ లు, బ్యాటిన్ లు డిజిపి గారి చేతుల మీదుగా ట్రాఫిక్ సిబ్బందికి అంధించడం చాలా ఆనంధంగా ఉందన్నారు.

# లోతట్టు ప్రాంతాలపై పూర్తి అప్రమత్తంగా ఉన్నాం






- **ప్రజలు ఆందోళన చెందాల్సిన పని లేదు**
- **ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**

**ఇబ్రహీంపట్నం, జూలై 31(మనం న్యూస్):** పులిచింతల నుంచి వరద నీరు నిలకడగా వస్తోందని, దీంతో ప్రకాశం బ్యారేజ్ అన్ని గేట్లు పైకిఎత్తి నీటిని కిందకు విడుదల చేస్తున్నామని, లోతట్టు ప్రాంతాలపై పూర్తి అప్రమత్తంగా ఉన్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డ్యాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ లక్ష్మీశ గురువారం అధికారులతో కలిసి ఇబ్రహీంపట్నం మండలంలో పర్యటించారు. చిన లంక, పెద్ద లంక, ఫెర్రీ తదితర ప్రాంతాలను సందర్శించి.. వరద ఉధ్ధ ృతి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ బ్యారేజికి ఎగువన, దిగువన ఉన్న ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశామని.. రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్, పంచాయతీరాజ్, మునిసిపల్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండేలా ఆదేశాలిచ్చామన్నారు. గురువారం సాయంత్రం నాటికి వరద ఉధ్ధ ృతి మూడు లక్షల క్యూసెక్కులకు చేరుకునే అవకాశమున్నందున కృష్ణానది పరీవాహక ప్రాంతాల ప్రజలు వాగులు, వంకలు, కాలువలు వంటివి దాటే ప్రయత్నం చేయొద్దని.. చేపల వేటకు వెళ్లడం, పశువులు, గొర్రెలు, మేకలు వంటివాటిని వదలడం చేయొద్దని సూచించారు. నది వైపు వెళ్లకుండా పిల్లలను కూడా జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. వరదకు సంబంధించి ప్రజల నుంచి సమస్యలను తెలుసుకునేందుకు, ఆ సమస్యల పరిష్కారానికి తక్షణం స్పందించి, క్షేత్రస్థాయిలో సమన్వయ శాఖల బృందాలను అప్రమత్తం చేసేందుకు జిల్లా కలెక్టరేట్లో 91549 70454 నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని.. ఇది 24 గంటలూ పనిచేస్తుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఎస్డీఆర్ఎఫ్ బృందాలు కూడా సిద్ధంగా ఉన్నాయన్నారు. వరద పరిస్థితిపై ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అయితే జాగ్రత్తగా ఉండాలని, అధికారులు, సిబ్బంది చేసిన సూచనలను పాటించాలని సూచించారు. కలెక్టర్ లక్ష్మీశ వెంట విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు, కొండపల్లి మునిసిపల్ కమిషనర్ రమ్య కీర్తన తదితరులు ఉన్నారు.

# అత్యంత పారదర్శకంగా పౌర సరఫరాల సేవలు

- **నిరంతర పర్యవేక్షణ, విస్తృత తనిఖీలతో నిఘా**
- **ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**విజయవాడ సెంట్రల్, జూలై 31 (మనం న్యూస్)** ఎన్టీఆర్ జిల్లాలో అత్యంత పారదర్శకంగా పౌర సరఫరాల శాఖ ద్వారా సేవలందించడం జరుగుతోందని.. ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా నిరాటంకంగా సరుకుల పంపిణీ జరుగుతోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. గురువారం జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇగ్నైట్ సెల్ను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీ, రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న సరుకులు, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అందుతున్న రైస్ కార్డుల సేవలు, కార్డుదారులకు అందిస్తున్న సార్టెక్స్ ఫోర్టిఫైడ్ బియ్యం, బియ్యం నాణ్యతా పరీక్ష ప్రక్రియ తదితరాలతో కూడిన పోస్టర్లను, కరపత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో 957 రేషన్ దుకాణాల పరిధిలో 5 లక్షల 90 వేల రైస్కార్డులున్నాయని, ప్రతినెలా కార్డుదారులకు దాదాపు 8,400 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఉచితంగా అందించడం జరుగుతోందన్నారు. అదేవిధంగా 52 గ్యాస్ ఏజెన్సీల ద్వారా ఎల్పీజీ సిలిండర్ల సరఫరా జరుగుతోందని.. దీపం 2.0 పథకాన్ని పటిష్టంగా అమలుచేస్తున్నట్లు తెలిపారు. పౌర సరఫరాల శాఖ సేవల్లో ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రజలకు నాణ్యమైన సేవలందించేందుకు నిరంతర పర్యవేక్షణతో పాటు క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రేషన్ దుకాణాలు, ఎంఎల్ఎస్ పాయింట్లు జవాబుదారీతనంతో పనిచేసేలా చూస్తున్నట్లు వెల్లడించారు. కొత్త రైస్ కార్డులు, రేషన్ కార్డుల్లో సభ్యుల చేరిక, అడ్రస్ మార్పు, ఆధార్ సీడింగ్ తదితర సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఎ.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

# చందర్లపాడులో తొలి అడుగు

## చంద్రబాబు నాయుడు సింగపూర్ పర్యటన విజయవంతం పట్ల హర్షం



**చందర్లపాడు, జూలై 31(మనం న్యూస్):** ఆంధ్రప్రదేశ్లో సుపరిపాలన, పెట్టుబడుల ఆకర్షణకు సంబంధించిన కీలక అడుగులు వేగవంతం అవుతున్నాయని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. ఈ క్రమంలో చందర్లపాడు మండలం గుడిమెట్ల గ్రామంలో గురువారం నాడు జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. లాల్ బహదూర్ లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, గ్రామ సర్పంచ్, కూటమి నేతలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ, వాటి ప్రయోజనాలను తెలియజేసే కరపత్రాలను తంగిరాల సౌమ్య పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా, ప్రభుత్వం ప్రజలకు చేరువై, వారి అవసరాలను తీర్చే దిశగా చేస్తున్న కృషిని హైలైట్ చేశారు. గ్రామస్థాయిలో ప్రజలతో నేరుగా సంభాషించి, వారి సమస్యలను అర్థం చేసుకునేందుకు ఈ కార్యక్రమం ఒక వేదికగా నిలిచింది. మరోవైపు, ఆంధ్రప్రదేశ్ను ఆర్థికంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 26 నుంచి 31 వరకు సింగపూర్లో ఆరు రోజుల పర్యటన చేపట్టారని అన్నారు. ఈ పర్యటన రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు, అంతర్జాతీయ భాగస్వామ్యాలను బలోపేతం చేయడంపై దృష్టి సారించిందన్నారు. సింగపూర్లో జరిగిన ఈ పర్యటనలో సీఎం చంద్రబాబు నాయుడు పలు అంతర్జాతీయ సంస్థలు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలతో సమావేశమై, ఆంధ్రప్రదేశ్లోని పెట్టుబడి అవకాశాలను వివరించారు. పోర్ట్ ఆధారిత ప్రాజెక్టులు, సెమీకండక్టర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ, ఎకో-టూరిజం వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆయన ప్రత్యేక దృష్టి సారించారు.

# స్థానికత కలిగిన హోం గార్డులను స్వరాష్ట్రాలకు బదిలీ చేయించాలి



- **సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ**

**విజయవాడ సెంట్రల్, జూలై 31(మనం న్యూస్):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత 15 సంవత్సరాల క్రితం నియమితులైన దాదాపు 400 మంది ఆంధ్రప్రదేశ్ కు చెందిన హోంగార్డులు చాలీచాలని రోజువారీ వేతనాలతో, కుటుంబాలకు దూరంగా ఉంటూ, తెలంగాణాలో విధులు నిర్వర్తిస్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. ఇంటర్మీడియట్ వరకు వీరి చదువు ఆంధ్రప్రదేశ్లో పూర్తి చేశారనీ, అందువల్ల వీరు తెలంగాణాలో నాన్ లోకల్ గా పరిగణించబడుతున్నారన్నారు. ఫలితంగా తెలంగాణ రాష్ట్రంలోని కానిస్టేబుల్ సెలెక్షన్ లో హోంగార్డులకు ఇచ్చే వెసులుబాటును కోల్పోతున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ కానిస్టేబుల్ సెలెక్షన్స్ లో దరఖాస్తు చేసుకోగా, వీరి సర్వీసు తెలంగాణలో ఉన్నందున ఆంధ్రప్రదేశ్ కోటా వర్తించదంటున్నారని అన్నారు. అందువల్ల రెండు తెలుగు రాష్ట్రాలలో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డులు నష్టపోతున్నారన్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చే రేషన్ కార్డులు, ఇళ్లస్థలాలు, పక్కా గృహాలు వంటి పలు పథకాలను కోల్పోతున్నారని అన్నారు. తెలంగాణాలో పనిచేస్తున్న 400 మంది హోంగార్డుల బాధలను గ్రహించి ఆంధ్రప్రదేశ్ కు బదిలీ చేయించవలని ఆయన కోరారు.

# రహదారుల అభివృద్ధికి కృషి చేయండి

- **ఢిల్లీలో కేంద్ర మంత్రి గడ్కరిని కలిసిన మచిలీపట్నం ఎంపీ బాలశౌరి**



**ఢిల్లీ, జూలై 31(మనం న్యూస్):** కేంద్రమంత్రి నితిన్ గడ్కరిని మచిలీపట్నం ఎంపీ బాలశౌరి గురువారం నాడు ఢిల్లీలో కలిసి పలు రహదారుల మంజూరు గురించి ప్రతిపాదనలు ఇచ్చినట్లు తెలిపారు. మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలోని కృష్ణా జిల్లాలోని గుడివాడ నుండి కంకిపాడు వరకు దాదాపు 27 కిలోమీటర్ల విస్తీర్ణంలో గ్రీన్ఫీల్ రోడ్డు ప్రాజెక్టును మంజూరు చేయవలసిన అవసరాన్నివారికీ వివరించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ రోడ్డు జాతీయ రహదారి 165 (ఎన్ హెచ్-165), జాతీయ రహదారి 216-హెచ్ ను జాతీయ రహదారి 65 (ఎన్ హెచ్-65) తో ఇలా మూడు నేషనల్ హై వే లను కలుపుతుందని, అందువలన గుడివాడ నుండి విజయవాడకు ప్రయాణం చాలా తక్కువ సమయంలో చేరుకునే అవకాశం ఉందని తెలియ చెప్పడం జరిగింది. ప్రస్తుత రోడ్డు ప్రక్కనే ఉన్న రెండు పంట కాలవల వలన తీవ్రంగా దెబ్బతింటోంది. దీని వలన రోడ్డు దీర్ఘకాలిక ప్రజా, వాణిజ్య వినియోగానికి అనుకూలంగా లేదని, అందువలన ఈ ప్రాంతంలో ప్రయాణించే ప్రజలు, రవాణాదారులు, రైతులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారని, అందుకే గ్రీన్ ఫీల్ రోడ్డును ప్రతిపాదించడం జరిగిందని మంత్రి దృష్టికి తేవడం జరిగింది. దీనికోసం అలైన్మెంట్ సర్వే ఇప్పటికే పూర్తి కావడం జరిగిందని, ఇది సాంకేతికంగా ప్రధానమంత్రి గతి శక్తి జాతీయ మాస్టర్ ప్లాన్ కింద బాగా సరిపోతుందని వారికీ వివరించడం జరిగింది. ఈ ప్రతిపాదిత రోడ్డు మూడు జాతీయ రహదారులను అనుసంధానించడమే కాకుండా, రద్దీని తగ్గించడం, సజావుగా సరుకు రవాణా , ప్రయాణీకుల రాకపోకలకు మద్దతు ఇవ్వడం ద్వారా ఈ ప్రాంతం అంతటా మల్టీమోడల్ లాజిస్టిక్స్ , మౌలిక సదుపాయాల సామర్థ్యాన్ని కూడా పెంచుతుందని, ఈ విషయంలో, దీర్ఘకాలిక స్థిరత్వం, ఆర్థిక వృద్ధి, ప్రజా సౌలభ్యం దృష్ట్యా, ఈ కీలకమైన ప్రాంతీయ కనెక్టివిటీ ప్రాజెక్టును పరిగణనలోకి తీసుకుని, గుడివాడ-కంకిపాడు గ్రీన్ఫీల్ రహదారిని ప్రధానమంత్రి గతి శక్తి పథకం కింద వీలైనంత త్వరగా మంజూరు చేయాలని మంత్రిని కోరడం జరిగిందన్నారు. గుడివాడ పట్టణంలోని రహదారులు విషయంలో అలాగే గుడివాడ పట్టణ పరిధిలోని జాతీయ రహదారి 216హెచ్ కోసం వార్షిక ప్రణాళిక కింద రు.18.50 కోట్ల అంచనా వ్యయంతో ఒక ప్రతిపాదన సమర్పించబడిందని మంత్రికి తెలియచేయడం జరిగిందన్నారు. గుడివాడ కృష్ణా జిల్లాలో కీలకమైన పట్టణ కేంద్రం అని, ముఖ్యంగా గుడివాడ పట్టణ పరిధిలో భారీ వాహనాల రాకపోకలను ఎదుర్కొంటోందని, పట్టణంలోని ఎన్ హెచ్-216హెచ్ విస్తరణ ప్రస్తుత పరిస్థితి తరచుగా ట్రాఫిక్ రద్దీకి మరియు ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యానికి కారణమవుతోందని, ముఖ్యంగా రద్దీ సమయాల్లో పరిస్థితి యొక్క ఆవశ్యకత మరియు అడ్డంకుల వల్ల రోజువారీ ప్రజా ఇబ్బందులు తలెత్తుతున్నందున, ఈ ప్రతిపాదనను ప్రస్తుత వార్షిక ప్రణాళికలోనే మంజూరు చేయాలని కోరడం జరిగింది. ఈ ప్రాజెక్టు త్వరగా అమలు చేయడం వల్ల ట్రాఫిక్ భారాన్ని తగ్గించడం, వాహనాల సజావుగా సాగేలా చూడటం మరియు రహదారి భద్రతను పెంచడం జరుగుతుందని చెప్పడం జరుగుతుందన్నారు.

# పాడి రైతులకు రూ.13 కోట్ల బోనస్

## కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు



**విజయవాడ సెంట్రల్, జూలై 31(మనం న్యూస్):** విజయవాడలోని (విజయ పాల ప్యాక్టరీ) కృష్ణా మిల్క్ యూనియన్ కు వచ్చిన లాభాల్లో పాడి రైతులకు రు.13 కోట్ల రూపాయలు బోనస్ గా ఇవ్వనున్నట్లు మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు గురువారం నాడు మీడియా సమావేశం ఏర్పాటు చేసి ప్రకటించారు.

ఈ సందర్బంగా చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ గురువారం నాడు జరిగిన పాలక వర్గ సమావేశములో సమితి పాడి రైతులకు 2025-26 ఆర్థిక సంవత్సరమునకు గాను మొదటి విడత బోనస్ ఏప్రిల్ -25 నుండి జూలై - 25 వరకు సుమారు రూ.13 కోట్లను పాడి రైతులకు ఆగష్టు మాసములో చెల్లించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ పాడి రైతులకు అత్యధిక ధర చెల్లించడం తో పాటుగా క్రమం తప్పకుండా బోనస్ చెల్లిస్తున్నఏకైక సహకార సంస్థ కృష్ణా మిల్క్ యూనియన్ అని ఆయన తెలిపారు.

# అనుమతులు లేకుండా.. శ్రీ చైతన్య పాఠశాల

- శ్రీ చైతన్య పాఠశాల కాదు. కేవలం ట్యూషన్ సెంటర్ మాత్రమే
- పాఠశాల ఇన్‌చార్జ్ అశ్విని వివరణ
- పర్మిషన్స్ ఇవ్వని డీఈఓ
- గందరగోళంలో విద్యార్థులు, తల్లిదండ్రులు
- స్పష్టమైన వివరణ ఇవ్వాలని విద్యార్థి సంఘాల డిమాండ్
- విద్యార్థి సంఘాల నిరసనలతో కదిలిన యంత్రాంగం
- పాఠశాలను మూసివేసి నోటీసులు అంటించిన విద్యాశాఖ

**కామారెడ్డి, జూలై 31 (మనం జిల్లా ప్రతినిధి) :** కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్న శ్రీ చైతన్య విద్యాసంస్థను రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీడీ ఎస్ యు ( ఎస్ ) జిల్లా అధ్యక్షులు ఎన్. బాల్ రాజ్ మాట్లాడుతూ., విద్యాశాఖ నుండి అనుమతులు పొందకుండా బాన్సువాడలో శ్రీ చైతన్య పాఠశాల నడిపిస్తుండడంతో మంగళవారం విద్యార్థి సంఘాల తరుపున పాఠశాలకి వెళ్లి ధర్నా చేయడం జరిగిందని అన్నారు. ఇదే సందర్భంలో పాఠశాల ఇంచార్జ్ ని ప్రశ్నించగా ఇది శ్రీ చైతన్య పాఠశాల కాదని, కేవలం ట్యూషన్ సెంటర్ అని అర్ధరాహితమైన సమాధానాలు ఇస్తున్నారని మండిపడ్డారు. కావున ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండా నడుస్తున్నటు శ్రీ చైతన్య పాఠశాలను తక్షణమే విద్యాశాఖ అధికారులు సీజ్ చేయవలసిందిగా డీఈఓ ని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో డిమాండ్ చేయడం జరుగుతుందని అన్నారు. మళ్లీ బాన్సువాడ లో శ్రీ చైతన్య విద్యాసంస్థ వారు విద్యార్థులను, తల్లిదండ్రులను మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు తక్షణ చర్యలకు పూనుకొని పాఠశాలను మూసివేయాలని, ముసివేయకుంటే ఎలాంటి అనుమతులు లేని శ్రీ చైతన్య పాఠశాలతో విద్యాశాఖ అధికారులు మమేకమైనరాని అనుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అనుమతులు లేకుండా పాఠశాల నిర్వహిస్తే విద్యార్థులు ఒక్క సంవత్సరం కాల భవిష్యత్ వ్యర్థం అవుతుందని, ఇది ఇలాగే కొనసాగితే విద్యార్థి సంఘులు విద్యాశాఖ అధికారుల యొక్క కార్యాలయాలను ముట్టడి చేయవలసి ఉంటుందని ఈ సందర్బంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టి. యన్. ఎస్. యఫ్ రాష్ట్ర నాయకులు పుట్ట భాస్కర్, టీ. ఎస్. పి జిల్లా అధ్యక్షులు మావురం శ్రీకాంత్, పిడిఎస్ యు (ఎస్) బాన్సువాడ డివిజన్ నాయకులు ఎన్. సాయిబాబా, శివకుమార్, ఎండీ. ఫాజల్, అబ్దుల్ హాకిమ్, ప్రశాంత్, నిఖిల్, మేఘనత్, నవీన్ టి. యన్. ఎస్. యఫ్, నాయకులు గణేష్, వేణు గౌడ్, టివిస్వీ నాయకులు రవీందర్ గౌడ్, మహేష్, జీవన్ లు పాల్గొన్నారు.






**విద్యార్థి నాయకుల డిమాండ్‌తో కదిలిన యంత్రాంగం..**

విద్యార్థి సంఘాలు పిడిఎస్యు, టివిస్వీ - టి. యన్. ఎస్. యఫ్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేసిన నేపథ్యంలో సబ్ కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు శ్రీ చైతన్య విద్యాసంస్థను రెవిన్యూ సిబ్బంది, విద్యా శాఖ సిబ్బంది, పోలీసు శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో శ్రీ చైతన్య పాఠశాలను మూసివేసి నోటీసులు అంటించారు.



## ఐ రాడ్ అప్లికేషన్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల పరిశీలించిన డీఎంహెచ్ఓ

**కామారెడ్డి, జూలై 31(మనం జిల్లా ప్రతినిధి) :** ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ అండ్ డేటా బేస్ అప్లికేషన్లో జిల్లాలోని ముందుగా ఆరోగ్యశ్రీ ఎంపాల్మెంట్ కలిగిన ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు కామారెడ్డి జిల్లా ఇన్చార్జి డిఎంహెచ్ఓ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం కామారెడ్డి జిల్లాలోని కలెక్టరేట్ లోని డిఎంహెచ్ఓ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి లాగిన్ ద్వారా నమోదు చేసుకున్న హాస్పిటల్ వివరాలు పరిశీలించి అప్రూవల్ ఇవ్వడం జరిగిందని డిఎంహెచ్ఓ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నాలుగు సంవత్సరాలుగా ఈ అప్లికేషన్ పోలీసు, రవాణా, రహదారుల విభాగాలకు ప్రమాదాలకు గల కారణాలు, విశ్లేషణను అందిస్తుందన్నారు. ఇందులో భాగంగా తెలంగాణలో మొదటిసారిగా కామారెడ్డి జిల్లాలోని 12 ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు అవకాశం కల్పించామన్నారు. దీంతో రోడ్డు ప్రమాదానికి సంబంధించిన మెడికో లీగల్ సర్టిఫికెట్, డిశ్చార్జి సమ్మరీ, పోస్టుమార్టం రిపోర్టులు అప్లికేషన్లో పొందవచ్చన్నారు. అలాగే కామారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదానికి గురైన వారు జిల్లాలో 12 ప్రభుత్వ, ప్రవేట్ హాస్పిటల్ లలో ఒక లక్ష యాభై వేలు వరకు నగదు రహిత చికిత్స పొందడానికి అవకాశం ఉందన్నారు. ఈ సదుపాయం త్వరలోనే అమలు చేయడం జరుగుతుందని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శ్రీ జిల్లా మేనేజర్ సత్యనారాయణ, ఐఆర్ఏడీ ప్రాజెక్ట్ మేనేజర్ ఆర్ రోజా, ఆరోగ్యశ్రీ జిల్లా ఇన్చార్జి టీమ్ లీడర్ మహమ్మద్ అలావుద్దీన్, డిప్యూటీ డిఎంహెచ్ఓ ప్రభు కిరణ్, చలపతి తదితరులు ఉన్నారు.

## కనీస వేతనం రూ.26 వేలు చేయాలి

- టీయూసీఐ జాతీయ ఉపాధ్యక్షుడు వనమాల కృష్ణ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా...

**నిజామాబాద్, జూలై 31(మనం బ్యూరో) :** కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చేయాలని టీయూసీఐ జాతీయ ఉపాధ్యక్షుడు వనమాల కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్ ముందు గురువారం టీయూసీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., కార్మికులకు కనీస పెన్షన్ రూ.9వేలు అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అందించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ కంటే తెలంగాణ కార్మికులకు తక్కువ వేతనాలు ఉండడం సిగ్గుచేటన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం కార్మికులను మోసం చేసిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అదే ధోరణిలో ప్రవర్తిస్తోందని మండిపడ్డారు. భవిష్యత్తులో బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నరేందర్, సుధాకర్, ఉపాధ్యక్షులు వెంకన్న, రాజేశ్వర్, మల్లేష్, మురళి, కిరణ్, రవి, హేమలత, సుమలత, శారద, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.




## పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం..

- లబ్ధిదారులకు రేషన్ కార్డు ప్రతిని అందించిన నాయకులు

**బీబీపేట్, జూలై 31(మనం న్యూస్) :** బీబీపేట్ మండలంలోని షేరి బీబీపేట్ గ్రామంలో నూతనంగా రేషన్ కార్డులు జారీ లబ్ది దారులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుతారి రమేశ్ రేషన్ కార్డు ప్రతిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వకుండా, ప్రజలను ప్రభుత్వ, సంక్షేమ పథకాలకు దూరం చేసి పబ్బం గడిపిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం అనునిత్యం పేద ప్రజలకు అండగా ఉంటుందని మరోమారు రుజువైందని అన్నారు. పేద ప్రజలకు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం అందిస్తూ వారి కళ్లలో ఆనందం చూస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షడు భూమాగౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తోట రమేశ్, మండల యూత్ అధ్యక్షుడు మహేష్, సీనియర్ నాయకులు చంద్రాగౌడ్, రాకేష్ రెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.






**జాతీయం- అంతర్జాతీయం**

## పాకిస్థాన్‌కు చెక్.. చీనాబ్‌పై 'సావల్‌కోట్' ప్రాజెక్టు!

ఢిల్లీ, జూలై 31 : సింధూ జలాల ఒప్పందం నిలిపివేత తర్వాత జమ్మూ కశ్మీర్‌లో పలు కీలక ప్రాజెక్టులపై దృష్టి పెట్టిన భారత ప్రభుత్వం భారీ జలవిద్యుత్తు ప్రాజెక్టు పునరుద్ధరణకు సిద్ధమవుతోంది. చీనాబ్ నదిపై గతంలో నిలిపివేసిన సావల్‌కోట్ జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించి నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ ఇటీవల అంతర్జాతీయ టెండర్లను ఆహ్వానించింది. ఇటీవలే తుల్‌బుల్ ప్రాజెక్టు పునరుద్ధరణ చర్యలు చేపట్టగా, తాజాగా భారీ జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం నడుం బిగించింది.

కశ్మీర్‌లోని చీనాబ్ నదిపై సావల్‌కోట్ జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మించాలనే ప్రతిపాదన 1980ల నుంచే ఉంది. దీనిపై పాకిస్థాన్ అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో దాదాపు 40 ఏళ్లుగా పక్కన పెట్టాల్సి వచ్చింది. అయితే, ఇటీవల సింధూ జలాల ఒప్పందం అమలు నిలిపివేయడం.. దీంతో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఎటువంటి అడ్డంకులు లేకపోవడంతో ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. 1856 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు నిర్మాణానికి దాదాపు రూ.22 వేల కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనా. రెండు దశల్లో దీన్ని నిర్మించనున్నట్లు తెలిసింది.

ఈ ప్రాజెక్టును జమ్మూకశ్మీర్ ప్రభుత్వం దశాబ్దం క్రితమే మొదలుపెట్టగా.. కొంత ఖర్చు కూడా చేసినట్లు సమాచారం. 2021లో కేంద్రం జోక్యం చేసుకుని ఎన్‌హెచ్‌పీసీని భాగస్వామ్యం చేయడంతోపాటు పలు కీలక ఒప్పందాలను చేసుకుంది. అంతర్జాతీయ బిడ్డింగ్‌కు ఉన్న అడ్డంకులను తొలగించేందుకు చర్యలు చేపట్టింది. చివరగా పర్యావరణ మంత్రిత్వశాఖ నుంచి అనుమతులు కూడా రావడంతో ప్రాజెక్టు నిర్మాణానికి మార్గం సుగమం అయినట్లు తెలుస్తోంది.

సింధూ జలాల ఒప్పందం ప్రకారం.. పశ్చిమదిశగా పాకిస్థాన్ వైపు ప్రవహించే సింధూతోపాటు చీనాబ్, జీలం వంటి ప్రధాన ఉప నదులపై భారత్‌కు పరిమిత అధికారాలు ఉన్నాయి. దీంతో భారీ స్థాయిలో నీరు నిల్వ చేసే అవకాశం లేకుండా పోయింది. ఏదైనా ప్రాజెక్టు ప్రారంభించాలన్నా.. పాకిస్థాన్‌కు ముందస్తు నోటీసు ఇవ్వాలి. తాజాగా ఆ ఒప్పందం నిలిచిపోవడంతో ఎటువంటి అనుమతులు, సమాచారం పంచుకోవడం అవసరం లేదు.

## ధర్మస్థల మిస్టరీ.. బయటపడిన అవశేషాలు

**మంగళూరు, జూలై 31 :** కర్ణాటకలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం 'ధర్మస్థల'లో అనుమానస్పద మరణాలపై మిస్టరీ కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించిన దర్యాప్తులో కీలక ముందడుగు పడింది. శ్రీక్షేత్ర సమీపంలోని అటవీ ప్రాంతంలో కొన్ని శవాలను పూడ్చి పెట్టానని ఒకప్పటి పారిశుద్ధ్య కార్మికుడు చూపించిన ప్రదేశాల్లో తవ్వకాలు జరుపుతున్న సంగతి తెలిసిందే. ఇందులో ఓ చోట గురువారం కొన్ని అవశేషాలను గుర్తించారు. ఇప్పటివరకు ఈ కేసులో బయటపడిన తొలి ఆధారం ఇదే కావడం గమనార్హం.

పారిశుద్ధ్య కార్మికుడి ఫిర్యాదు నేపథ్యంలో ఈ అనుమానాస్పద మరణాలపై రాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. గత సోమవారం నుంచి సిట్ అధికారులు.. అతడిని వెంట తీసుకెళ్లి దర్యాప్తు చేపట్టారు. నేత్రావతి నది స్నానఘట్టానికి అవతలి వైపు ఉన్న ప్రాంతం నుంచి పరిశోధన ప్రారంభించారు. మృతదేహాలను పూడ్చిపెట్టినట్లుగా మొత్తం 13 చోట్లను అతడు గుర్తించగా..



ఆ ప్రాంతాల్లో తవ్వకాలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే గురువారం ఆరో ప్రాంతంలో మానవ అవశేషాలు బయటపడ్డాయి. వాటిని ఫోరెన్సిక్ బృందం సేకరించి ల్యాబ్‌కు పంపించింది. ల్యాబ్‌లో పరీక్షించిన తర్వాతే వాటి గురించి వివరాలు తెలుస్తాయని సిట్ అధికారులు చెబుతున్నారు.

దక్షిణ కన్నడ జిల్లాలో ధర్మస్థల ప్రముఖ శైవ క్షేత్రం. కర్ణాటక ప్రజలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచీ ఇక్కడికి భారీగా వస్తుంటారు. గతంలో అక్కడ పనిచేసి వెళ్లిపోయిన ఓ పారిశుద్ధ్య కార్మికుడు.. ఇటీవల సంచలన ఆరోపణలు చేశాడు. 1998 నుంచి 2014 మధ్య ఇక్కడ అనేక మంది మహిళలు, యువతులు హత్యకు గురయ్యారని.. వారి మృతదేహాలను తానే పూడ్చి పెట్టానని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అవన్నీ అనుమానాస్పద రీతిలో అదృశ్యమైన వారివని, లైంగిక దాడులకు గురై చనిపోయినట్లు అనుమానాలున్నట్లు పేర్కొనడం అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. 2014 డిసెంబరులో తమ కుటుంబంలోని ఒక యువతిని కొందరు లైంగికంగా వేధిస్తుండడంతో తాము అజ్ఞాతంలోకి వెళ్లిపోయామని ఆ వ్యక్తి చెప్పినట్లు సమాచారం. మృతదేహాలను ఎవరు ఖననం చేయమన్నారు? వాటిని ఎవరి సహాయంతో తీసుకువెళ్లేవారు? తదితర ప్రశ్నలను సిట్ అధికారులు అడిగి అతడి నుంచి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం దీనిపై దర్యాప్తు కొనసాగుతోంది.

## వరదల్లో కొట్టుకుపోయిన రూ.12 కోట్ల బంగారం.. వెతికేందుకు ఎగబడిన జనం

బీజింగ్, జూలై 31 : చైనాలో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చాలాచోట్ల మెరుపు వరదలు సంభవించాయి. షాంగ్జీ ప్రావిన్స్‌లో వరదల కారణంగా ఓ నగల దుకాణంలో నుంచి బంగారం, వెండి ఆభరణాలు కొట్టుకుపోయాయి. దీంతో వాటిని వెతికేందుకు వీధుల్లో స్థానికులు పోటీపడ్డారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

షాంగ్జీ ప్రావిన్స్‌లోని వుచి కౌంటీలో జులై 25న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ప్రాంతం సముద్రతీరానికి సమీపంలో ఉంటుంది. ఇక్కడ స్థానికంగా ఉన్న లావోఫెంగ్జియాంగ్ ఆభరణాల దుకాణాన్ని ఎప్పటిలాగే ఉదయం సిబ్బంది తెరిచారు. అప్పటికే భారీ వర్షాలతో ఆ ప్రాంతమంతా జలమయమైంది. చూస్తుండగానే వరద నీరు



దుకాణంలోకి చొచ్చుకొచ్చింది. వరద ఉద్ధృతి పెరగడంతో కళ్లముందే దుకాణంలోని నగలు, సేఫ్ బాక్స్ కొట్టుకుపోయాయి.

కొట్టుకుపోయిన వాటిల్లో బంగారు హారాలు, గాజులు, ఉంగరాలు, చెవి దుద్దులు, వజ్రపు ఉంగరాలు, వెండి ఆభరణాలు ఉన్నట్లు దుకాణ యజమాని తెలిపారు. సేఫ్ బాక్సుల్లో రీసైకిల్ చేసిన బంగారంతో పాటు భారీగా నగదు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. దాదాపు 20 కిలోల బంగారం, నగదు గల్లంతైనట్లు తెలిపారు. వీటి విలువ 10 మిలియన్ యువాన్లు (అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.12కోట్ల పైమాటే) ఉంటుందని వెల్లడించారు.

బంగారం కొట్టుకుపోయిన విషయం తెలియగానే స్థానికులు పెద్దఎత్తున వీధుల్లోకి చేరి బంగారం కోసం వెతకడం ప్రారంభించారు. కొందరు స్వచ్ఛందంగా తమకు దొరికిన ఆభరణాలను వెనక్కి ఇచ్చేశారని దుకాణ యజమాని తెలిపారు. ఇప్పటివరకు కేజీ బంగారం తమ వద్దకు చేరిందన్నారు. రోజులు గడుస్తున్నా మిగతా బంగారం కోసం స్థానికులు వెతుకుతూనే ఉన్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అయ్యాయి.

## ట్రంప్ ఒత్తిడికి భారత్ లొంగకూడదు: శశిథరూర్

**ఢిల్లీ, జూలై 31 :** భారత దిగుమతులపై 25శాతం సుంకంతో పాటు అదనంగా జరిమానాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ స్పందించారు. వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతున్న తరుణంలో ఇలాంటి ప్రకటన సరికాదన్నారు. గురువారం పార్లమెంటు వెలుపల విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'భారత వాణిజ్యానికి అమెరికా అతి పెద్ద మార్కెట్. మన ఎగుమతులే 87-90 బిలియన్ డాలర్ల వరకు ఉంటాయి. రష్యా నుంచి దిగుమతులు చేస్తున్నందుకు సుంకాలు, జరిమానా విధిస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. వాణిజ్య



చర్చల్లో బేరసారాల కోసం ఇది హెచ్చరిక కావొచ్చు. టారీఫ్‌ల నేపథ్యంలో ఎగుమతులు తగ్గితే అది మనకు నష్టం కలుగుతుంది. ఇది మన జీడీపీపై కూడా ప్రభావం చూపించొచ్చు. అమెరికా డిమాండ్లు పూర్తిగా అర్థం లేనివిగా ఉన్నాయి. వాటిని ప్రతిఘటించే హక్కు భారత్‌కు ఉంది. వారిని సంతోషపెట్టడానికి మన జీవనోపాధిని పణంగా పెట్టలేం. మన అవసరాలను కూడా అగ్రరాజ్యం అర్థం చేసుకోవాలి' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ టారిఫ్‌ల విషయంలో మన దేశ విధానంపై నమ్మకం ఉందని థరూర్ పేర్కొన్నారు. తర్వాత ఎం జరుగుతుందనేది కొనసాగుతున్న చర్చలపై ఆధారపడి ఉంటుందన్నారు. అమెరికా ఒత్తిడికి లొంగిపోకుండా.. న్యూఢిల్లీ జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

## స్టాలిన్‌తో మార్నింగ్ వాక్..

### ఎన్డీయేకు పన్నీర్ సెల్వం గుడ్‌బై

**చెన్నై, జూలై 31 :** తమిళ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం ఎన్డీయే నుంచి వైదొలగారు. ఈ మేరకు మాజీ మంత్రి, సెల్వంకు నమ్మినబంటు రామచంద్రన్ ప్రకటించారు. ఆయన ప్రకటిస్తున్న సమయంలో సెల్వం కూడా అక్కడే ఉన్నారు. మార్నింగ్ వాక్ సమయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను పన్నీర్ సెల్వం కలిశారు. పలు విషయాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఎన్డీయే నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించడం గమనార్హం. ఎన్డీయే కూటమితో పూర్తిగా సంబంధాలు తెంచుకున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు. 2026 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పన్నీర్ సెల్వం రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించనున్నట్లు పేర్కొన్నారు. పొత్తుల గురించి ఇప్పుడు ప్రస్తావించాల్సిన సమయం కాదని, ఎన్నికల ముంగిట ఆ అంశం గురించి మాట్లాడతామని అన్నారు. మరోవైపు ఇటీవల సినీనటుడు విజయ్ ప్రారంభించిన తమిళ వెట్రి కళగ (టీవీకే)తో ఓపీఎస్ చేతులు కలిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పన్నీర్ సెల్వాన్ని విలేకరులు పొత్తుల అంశం గురించి ప్రస్తావించగా.. కాలమే చెబుతుంది అంటూ.. సమాధానం దాటవేశారు. పన్నీర్ సెల్వం ఒకానొక సమయంలో ఏఐఏడీఎంకేలో కీలకంగా వ్యవహరించారు. ఎన్డీయే కూటమిలోనూ ముఖ్యపాత్ర పోషించారు. అయితే, పార్టీలో ఏర్పడిన అంతర్గత కలహాలతో బహిష్కరణకు గురైన ఆయన.. సొంతంగా తన వర్గాన్ని విస్తరించుకున్నారు. తాజాగా ఎన్డీయే నుంచి కూడా బయటకు రావడం.. 2026 అసెంబ్లీ ఎన్నికల ముంగిట తమిళ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

## అండమాన్ నికోబార్‌లో తొలిసారి 'ఈడీ' సోదాలు!

**పోర్ట్ బ్లెయిర్, జూలై 31 :** ఓ మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అండమాన్ నికోబార్ దీవుల్లో సోదాలు నిర్వహించారు. ఈ దీవుల్లో ఈడీ తనిఖీలు చేపట్టడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. ఓ సహకార బ్యాంకు రుణాల వ్యవహారంలో అవకతవకలకు పాల్పడినట్లు స్థానిక కాంగ్రెస్ మాజీ ఎంపీ కుల్దీప్‌రాయ్ శర్మ తదితరులపై ఆరోపణలు ఉన్నాయి. దీనికి సంబంధించిన మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు పోర్ట్ బ్లెయిర్ పరిసరాల్లోని తొమ్మిది ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. కోల్‌కతాలోనూ తనిఖీలు కొనసాగాయి. అండమాన్ నికోబార్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంకు (ఏఎన్ఎస్సీబీ) ద్వారా రుణాలు, ఓవర్‌డ్రాఫ్ట్ మంజూరులో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొందరు 15 షెల్ సంస్థలు సృష్టించి.. బ్యాంకు నుంచి రూ.200 కోట్లకుపైగా రుణాలను మోసపూరితంగా తీసుకున్నారని అధికారులు వెల్లడించారు. ఈ రుణాల్లో చాలావరకు నగదు రూపంలో ఉపసంహరించుకుని.. గతంలో బ్యాంకు వైస్ ఛైర్మన్‌గా పనిచేసిన కుల్దీప్ రాయ్ శర్మకు, ఇతరులకు ముట్టజెప్పినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన పోలీసులు.. ఈ నెల 18న శర్మను అరెస్టు చేశారు. ఈ నెల 29న కోర్టు ఆయన్ను మూడు రోజుల పోలీసు కస్టడీకి పంపింది.



# కూటమి ప్రభుత్వంలో అంతా సుభిక్షం

- మాజీ ఎమ్మెల్సీ, బుద్దా వెంకన్న

**విజయవాడ పశ్చిమ, జూలై 31(మనం న్యూస్):** బుధవారం జగన్మోహన్ రెడ్డి ఒక యాప్ను ప్రారంభిస్తున్నామని ఆ యాప్లో ప్రజల కష్టాలను తెలుసుకుంటానని చెప్పడం మాత్రం చాలా సంతోషంగాఉందని, ఎందుకంటే కూటమి ప్రభుత్వంలో ఎవరూ కష్టాలు పడటం లేదని మాజీ ఎమ్మెల్సీ, బుద్దా వెంకన్న అన్నారు. బుదవారం నాడు ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ జగన్ మోహన్రెడ్డి గతంలో రూ.3 వేల పెన్షన్ చేస్తానని హామీ ఇచ్చి రూ.250, రూ.250, రూ.250 పెంచుకుంటూ చివరలో రూ. 3 వేలు చేస్తే చంద్రబాబు వచ్చీ రాగానే ఇచ్చిన హామీ ప్రకారం రూ.4 వేలకు పెంచడమే కాక ఎన్నికలు జరిగిన ఏప్రిల్, మే నెలలకు కూడా రూ.వెయ్యి చొప్పున కలిపి మొత్తం రూ.6 వేలు ఇవ్వడం జరిగింది. అలాగే తల్లికి వందనం పేరుమీద ఒక ఇంటిలో ఇద్దరు పిల్లలు ఉన్నా ఒకరికే జగన్మోహన్ రెడ్డి డబ్బులు వేసే వారు. చంద్రబాబు అమ్మవడి పేరుతో ఎంత మంది పిల్లలు ఉన్నా అంత మంది పిల్లలకు డబ్బులు వేయడం జరిగింది. నంద్యాలలో 11 మంది పిల్లలు ఉంటే 11 మంది పిల్లలకూ డబ్బులు వేయడం జరిగింది. కాబట్టి ఏపీలో కూటమి ప్రభుత్వంలో అందరూ సుఖ శాంతులతో ఉన్నారన్నారు. కానీ జగన్ యాప్ పెట్టడం అనేది నిజంగా చాలా సంతోషంగా ఉందన్నారు. ఎందుకంటే జగన్ హయాంలో (2019ఋ24)లో జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కల్తీ మద్యం వల్ల ఎంత మంది చనిపోయారు? ఎన్ని తాళిబొట్లు తెగిపోయాయి వీటన్నింటినీ జగన్ మోహన్ రెడ్డి తెలుసుకోవడానికి యాప్ అవసరమన్నారు. జగన్ నడిపిన కల్తీ మద్యం వల్ల దాదాపు 30 వేల మంది చనిపోయారు. ఆ వివరాలతో సహా ప్రజలు నీకు చెప్పడానికి రడీగా ఉన్నారన్నారు. దీనికి ఈ యాప్ అవసరమన్నారు. మద్యం స్కాంలో పందికొక్కుల్లాగా దోచుకున్నారే మీరు, మీ వెనకాల ఉన్నటువంటి రాజ్ కసిరెడ్డిలాంటి వ్యక్తులు అని విమర్శించారు. అది తెలుసుకోవడానికి యాప్ అవసరం. అలాగే ల్యాండ్ టైటిలింగ్ను తీసుకొచ్చి రాష్ట్రవ్యాప్తంగా ప్రజల




ఆస్తుల్ని, పొలాలను, ప్లాట్లను దోచుకున్నారు కదా. వీటిని తెలుసుకోవడానికి యాప్ అవసరం. అలాగే భారతదేశంలోనే జగన్ మోహన్ రెడ్డి హయాంలోనే ఎక్కువ మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు.

# నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు



**తిరుపతి, జూలై 31(మనం న్యూస్):** తల్లిపాల వారోత్సవాలు ఆగస్టు 1వ తేది నుంచి 7 వ తేది వరకు జిల్లా స్థాయిలో ప్రాజెక్టు మరియు అంగన్వాడి స్థాయిలో నిర్వహించడం జరుగుతుంది అని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి వసంత బాయి తెలిపారు. తల్లిపాల వారోత్సవం ప్రాధాన్యత₹ : శిశువుల ఆరోగ్యం మరియు అభివృద్ధికి తల్లి పాలివ్వడం కీలకం మరియు తల్లులకు కూడా గణనీయమైన ప్రయోజనాలను అందిస్తుంది. శిశువులకు ఆరోగ్య ప్రయోజనాలు ₹సరైన పోషణ:₹ శిశువుల ఆరోగ్యకరమైన పెరుగుదల మరియు అభివృద్ధికి అవసరమైన పోషకాల యొక్క సరైన సమతుల్యతను తల్లి పాలు అందిస్తాయి. దీనిలో ప్రోటీన్లు, కొవ్వులు, విటమిన్లు మరియు ఖనిజాలు శిశువులకు సరిగ్గా సరిపోయే నిష్పత్తిలో ఉంటాయి. రోగనిరోధక వ్యవస్థ మద్దతు: తల్లి పాలలో యాంటీబాడీలు మరియు రోగనిరోధక శక్తిని పెంచే కారకాలు పుష్కలంగా ఉంటాయి, ఇవి శిశువులను అంటువ్యాధులు మరియు వ్యాధుల నుండి రక్షించడంలో సహాయపడతాయి. శ్వాసకోశ అంటువ్యాధులు, జీర్ణశయాంతర అంటువ్యాధులు మరియు ఆకస్మిక శిశు మరణ సిండ్రోమ్ (ఎస్ఐడిఎస్) యొక్క తక్కువ ప్రమాదం తల్లి బిడ్డ కు పాలు ఇవ్వడం లో ఉంది.

# 'తొలి అడుగు'కు ప్రజల స్పందన



- స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మా రెడ్డి పట్టాభిరామ్

**విజయవాడ తూర్పు, జూలై 31(మనం న్యూస్):** కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మా రెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. గురువారం ఉదయం విజయవాడ తూర్పు నియోజకవర్గ పరిధిలోని 4వ డివిజన్ భారతి నగర్ ఏరియాలో కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు ఆధ్వర్యంలో చేపట్టిన సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మా రెడ్డి పట్టాభి రామ్, గద్దె క్రాంతి కుమార్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా భారతి నగర్ లోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి పొందు పరచిన కర పత్రాలని ప్రజలకి అందించడమే కాకుండా వారి సమస్యలు కూడా తెలుసుకుంటున్నామన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం మొదటి నెలలోనే పింఛన్లు వృద్ధులకు 4 వేల రూపాయల పెన్షన్, వికలాంగులకు 6 వేల రూపాయల పెన్షన్, తల్లికి వందనం పేరుతో ప్రతి బిడ్డకు తల్లికి వందనం అందచేశామన్నారు. ప్రతి మహిళకి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్ లు ఇస్తున్నామని, అలాగే ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు కాబోతుందని కొమ్మా రెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. కూటమి ప్రభుత్వ గురించి ప్రజలను అడుగుతుంటే సుపారిపాలన అందిస్తున్నారంటూ మమ్మల్ని ఆశీర్వదిస్తున్నారని అన్నారు. టిడిపి యువ నాయకులు తూర్పు గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నియోజకవర్గం లోని ప్రతి గడపకు వెళ్తున్నామని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చడం తో పాటు స్థానిక సమస్యలని కూడా పరిష్కరించే దిశగా అడుగులు ముందుకు వేస్తున్నామని అన్నారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి కూడా కట్టుబడి ఉన్నామని గద్దె క్రాంతి కుమార్ స్పష్టం చేసారు.

# పాత బస్టాండ్ స్థలాన్ని బడా కంపెనీలకు కట్టబెట్టొద్దు

## విజయవాడ ఆర్టీసీ బస్టాండ్పై రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

**విజయవాడ సెంట్రల్, జూలై 31(మనం న్యూస్):** ఆర్టీసీ పాత బస్టాండ్ స్థలాన్ని లులు కంపెనీకి కారుచౌకగా 99 సంవత్సరాలు లీజుకు ఇవ్వటాన్ని నిరసిస్తూ విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. లూలూ కంపెనీకి మేలు చేస్తూ విజయవాడకు, రాష్ట్రానికి కూటమి ప్రభుత్వం హాని చేస్తుందని విజయవాడ పౌర వేదిక ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక వ్యాపారాలను దెబ్బతీసి లులు సంస్థకు దాసోహం అంటున్న సర్కార్ తీరును వారు తప్పు పట్టారు. విజయవాడ నగర ప్రణాళిక బద్ధమైన అభివృద్ధిని, పర్యావరణాన్ని పాలకులు నాశనం చేస్తున్నారని అన్నారు. ఆర్టీసీ ప్రైవేటీకరణకు ప్రభుత్వం కుట్ర చేస్తుందని వారు మండిపడ్డారు. విజయవాడను, స్థానిక వ్యాపారాలను, ఆర్టీసీని, ప్రభుత్వ స్థలాలను కాపాడుకుంటామన్నారు. ఆర్టీసీ, ప్రభుత్వ స్థలాల జోలికి.. ప్రభుత్వం , లులు వస్తే అడ్డుకుంటాం, విజయవాడ నగరాన్ని



పరిరక్షించుకుంటామన్నారు. పౌర వేదిక ఆధ్వర్యంలో 'ఆర్టీసీ స్థలాల పరిరక్షణ కమిటీ' ఏర్పాటు ఏర్పాటు చేశారు. ఆగస్టు 6వ తేదీన పాత బస్టాండ్ వద్ద మహా ధర్నా చేపట్టాలని తీర్మానం చేశారు. ఉమ్మడి ఆందోళనకు నిర్ణయం తీసుకున్నారు. గురువారం నాడు విజయవాడ బాలోత్సవ భవన్ లో విజయవాడ పౌరవేదిక ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో నగర ప్రముఖులు, సామాజికవేత్తలు, న్యాయవాదులు, మేధావులు ఆర్టీసీ, ఇతర కార్మిక ఉద్యోగ సంఘ నేతలు, వ్యాపార వాణిజ్య సంఘాల ప్రతినిధులు, పౌర, ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మాజీ మంత్రి, రైతు నేత వడ్డే శోభనాద్రీశ్వరరావు, మాజీ మేయర్ జంధ్యాల శంకర్, ప్రముఖ న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్, ఆర్టిసి ఉద్యోగ నేతలు పి.దామోదర్, సుందరయ్య, జన చైతన్య వేదిక నేత లక్ష్మణ రెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు కొనకళ్ళ విద్యాధరరావు, పౌర సంఘాల నేతలు సిహెచ్.బాబురావు, డి.కాశీనాథ్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# హిందుపురం అభివృద్ధికి సహకరించండి



- ఎంపీలతో కలిసి కేంద్ర మంత్రుల్ని కలిసిన ఎమ్మెల్యే బాలయ్య

**ఢిల్లీ, జూలై 31(మనం న్యూస్):** హిందూపురం నియోజకవర్గం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ గురువారం పార్లమెంట్లో ఎంపీ కేశినేని శివనాథ్, ఇతర టిడిపి ఎంపీలతో కలిసి పలువురు కేంద్రమంత్రుల్ని కలిశారు. కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాలు, విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, కేంద్ర రోడ్డు, రవాణా మంత్రి నితిన్ గడ్కరీలను కలిసి హిందూపురం నియోజవకర్గం అభివృద్ధికి తోడ్పాటు అందించాల్సిందిగా ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పలు వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్లమెంటరీ పార్టీ నాయకుడు, ఎంపీ లావుకృష్ణదేవరాయులు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు,ఎం.పి ఎం.శ్రీభరత్, ఎంపీ హరీష్ మాధుర్, ఎంపీ తెన్నేటి ప్రసాద్,ఎంపీ బీకే పార్థసారథి, ఎంపీ లక్ష్మీనారాయణ లతో పాటు పాల్గొన్నారు.

# ఘనంగా ద్వారకా వెంకన్న కళ్యాణ మహోత్సవం



**ఎన్టీఆర్ జిల్లా/ చందర్లపాడు, జూలై 31(మనం న్యూస్):** ఎన్టీఆర్ జిల్లా గుడిమెట్లలో ద్వారకా కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొని, వేద పండితుల ఆశీర్వచనం పొందారు. వేద మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ జరిగిన ఈ కళ్యాణోత్సవం భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణాన్ని అందించింది. తంగిరాల సౌమ్య ఈ సందర్భంగా జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, భక్తులతో కలిసి స్వామి వారి కృపాకటాక్షాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, శ్రీ ద్వారకా కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి విశేషతను గురించి వివరించారు. 'శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తుల కోర్కెలను తీర్చే కల్పవృక్షం, కష్టాలను తొలగించే కామధేనువు. ఈ పవిత్ర కళ్యాణ మహోత్సవం భక్తుల మనస్సులో ఆధ్యాత్మిక శాంతిని, సౌభాగ్యాన్ని నింపుతుంది. స్వామి వారి దివ్య మంగళ స్వరూపం ఈ ప్రాంత ప్రజలకు సదా రక్షణగా నిలుస్తుంది,' అని ఆమె పేర్కొన్నారు. అనంతరం, అన్నదాన కార్యక్రమంలో విశేష సంఖ్యలో పాల్గొన్న భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమం గుడిమెట్లలో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది, సౌమ్య భక్తిపూర్వక పాల్గొనడం భక్తులకు స్ఫూర్తినిచ్చింది. ఈ కార్యక్రమంలో లాల్ బహదూర్ లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కోట వీరబాబు, గ్రామ సర్పంచ్, భక్తులు మహిళలు స్థానికులు గ్రామస్తులు కూటమినేతలు పాల్గొన్నారు.

# నిరుపేదలకు అండగా సీఎంఆర్ఎఫ్



- రూ.2 లక్షల 50 వేల ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే జీఎంఆర్

**రామచంద్రపురం, జూలై 31(మనం న్యూస్):** నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలోని మయూరి నగర్ కాలనీకి చెందిన బిక్షపతి గత కొంతకాలంగా అనారోగ్యంలో బాధపడుతున్నారు. స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. చికిత్స నిమిత్తం రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసి మంజూరు అయింది. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిక్షపతి కుటుంబ సభ్యులకు ఎల్ఓసి అనుమతి పత్రాలను ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అందజేశారు.

# తెలంగాణ బతుకు చిత్రాల ప్రదర్శన

## రుస్తుం ఆర్ట్ గ్యాలరీలో వరల్డ్ పెయింటింగ్ డే

**సిద్దిపేట అర్బన్, జూలై 31(మనం న్యూస్):** వరల్ పెయింటింగ్ డే పురస్కరించుకొని తెలంగాణ బతుకు చిత్రాల ద్వారా తెలంగాణ అస్థిత్వాన్ని, జీవన విధానాన్ని తెలిసేలా రుస్తుం ఆర్ట్ గ్యాలరీలో తెలంగాణ బతుకు చిత్రాల ప్రదర్శనను అంతర్జాతీయ చిత్రకారులు రుస్తుం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో చిత్రాన్ని చిత్తరువు, చిత్రలేఖనం, పెయింటింగ్ అని, ఆదిమానవుని ప్రస్థావన ప్రకృతిలో ఉరుములకు మెరుపులకు భయపడి గుహలల్లో దాక్కొని శక్తి ఆకారాన్ని గీసుకొని శరను పొందాడని, దైనందిన జీవన విధానాన్ని రాళ్ల పై చెక్కుకొని నాటినుండి నేటివరకు చిత్రకళ ఎన్నో రకాలుగా రూపాంతరం చెందిందన్నారు. రకరకాల పేపర్స్, క్యాన్వాస్ ప్రకృతిలో ప్రతి వస్తువు సంస్కృతులపై చిత్రకళ తన ప్రభావాన్ని ఉనికిని చాటుకొని ఆధునిక యుగంలో డ్రాయింగ్, డిజైన్, స్కల్ప్చర్, పెయింటింగ్ ప్రార్థనా, గుళ్ళూ గోపురాలు శిల్పాలు ఆర్కిటేక్ డ్యాములు ఇంజనీరింగ్ వైద్య విద్య వ్యాపార సినిమా, ప్రెస్ చరిత్ర ప్రపంచ సంస్కృతి ఇతర వాటిపై చిత్రకళ పెయింటింగ్ రేఖా



రంగుల విన్యాస ప్రభావం ప్రతి రంగంపై పులుము కుందన్నారు. ఆగస్టు 1న వరల్ పెయింటింగ్ డే అందరి జీవితాలను కళావంతం చేయాలని ఐక్యత శాంతి సౌభగ్యాలను పెంపొందించాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎ ఎఫ్ అధ్యక్షురాలు జులేఖరుస్తుం, నైరూప్య చిత్ర కారుడు నహీంరుస్తుం, నేచర్ ఆర్టిస్ట్ రూబినారుస్తుం, ఎండి రహీం తదితరులు పాల్గొన్నారు.

# సోమేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే యశస్విని ప్రత్యేక పూజలు



**పాలకుర్తి, జూలై 31(మనం న్యూస్):** శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ సోమేశ్వర లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో గురువారం ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆలయంలో స్వామి వార్లను దర్శించుకుని అభిషేకాలు అర్చనలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి,ఝాన్సీ రెడ్డిలకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనాలు అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని పాడి పంటలు సమృద్ధిగా పండాలని, రాష్ట్ర నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యంతో ఉండాలని శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. అదేవిధంగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని,ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యానారాయణ ,మండల పార్టీ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి,ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు జలగం కుమార్, ఆలయ మాజీ చైర్మన్ చిలువేరు కృష్ణమూర్తి యాదవ్, బిర్రు సోమేశ్వర్, మాదాస్ హరీష్ గౌడ్,తదితరులు ఉన్నారు.

# మెరుగైన వైద్య సేవలందించాలి

- వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రతి రోగి ముఖ్యుడే
- మానవతా దృక్పథంతో పనిచేయాలి
- రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



**ములుగు, జూలై 31(మనం ప్రతినిధి):** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క వైద్యాధికాలకు సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తో కలిసి సీజనల్ వ్యాధుల పై వైద్య అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రివెన్షన్ బెటర్ దెన్ క్యూర్ అనే నినాదానికి బద్ధులై పనిచేయాలని, వైద్యుడుగా కనిపించే దేవుళ్ళని వైద్య శాఖకు తెలుపుతూ, వర్షాకాలంలో వచ్చే మలేరియా డెంగ్యూ అతి సార టైఫాడ్లపై చికిత్స తో పాటు గ్రామాలలో గ్రామ పెద్దలు యువకుల సమూహంతో అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించాలని, అప్పుడే ప్రజలు వ్యాధి నియంత్రణ పట్ల చైతన్యవంతులు అవుతారని తెలిపారు. దట్టమైన అడవి ప్రాంతాలు, రోడ్డు సౌకర్యం లేని గ్రామాలలో ఉదయాన్నే గ్రామాలకు వైద్య సిబ్బంది చేరి ఇంటింటి సర్వే చేసి వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్సను అందించి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించాలని వైద్య సిబ్బందిని సూచించారు. గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వారికి పరీక్షలు, మందులు సకాలంలో అందించాలని అన్నారు. రాబోయే రెండు నెలలు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి వైద్య సేవలు అందించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రతి రోగి ముఖ్యుడే అని, మానవతా దృక్పథంతో పనిచేయాలని, రోగుల పట్ల ప్రేమ వాత్సల్యంతో వైద్యం అందిస్తే ప్రజలలో వైద్యుల పేర్లు చిరకాల నిలుస్తుందని, వైద్య సిబ్బంది సమయాన్ని పాటించాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ ములుగు వచ్చే రోగులకు అన్ని రకాల వైద్య సేవలను అందించాలని జనరల్ హాస్పిటల్ ములుగు అధికారులను సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం లో వచ్చే వ్యాధులను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఆరోగ్య కేంద్రానికి ముందస్తుగానే నిధులను మంజూరు చేశామని గత సంవత్సర పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ముందస్తుగానే వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై పటిష్టమైన ప్రణాళికలను తయారుచేసుకొని చివరి సర్వే, ఆంటీ లార్వా చర్యలను, నిర్వహిస్తున్నామని హైరిస్కు గ్రామాలను ముందస్తుగానే గుర్తించి ఆ గ్రామాలలో దోమల నియంత్రణకై యాంటీ లార్వా స్ప్రే మరియు ఫాగింగ్ లాంటి చర్యలు తీసుకున్నామని దానితోపాటు ప్రతి గ్రామం లో ఇప్పటి వరకే రెండు పర్యాయాలు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించామని ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, ఆశ్రమ స్కూల్లో కూడా వైద్య శిబిరాలను నిర్వహించి విద్యార్థులకు వైద్య చికిత్సలను అందించటంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పోషకాహార ప్రాముఖ్యత మీద అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, ములుగు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ స్వర్ణ కుమారి, ఏటూరునాగారం డి సి హెచ్ డాక్టర్ జగదీష్, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ విపిన్ కుమార్, డాక్టర్ క్రాంతి, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ చంద్రకాంత్, డాక్టర్ రణధీర్, డాక్టర్ పవన్ కుమార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు జనరల్ హాస్పిటల్ వివిధ విభాగాల అధికారులు మెడికల్ కాలేజ్ వివిధ విభాగాల ప్రొఫెసర్, డెమో సంపత్, ఆర్ బి ఎస్ కే టీం వైద్యాధికారులు ఎం సి హెచ్ టీం వైద్యాధికారులు, మిడ్ లేవల్ హెల్త్ ప్రొవైడర్స్, తదితరులు పాల్గొన్నారు.

## అది ఫైనల్ అయినా సరే.. బహిష్కరించే వాళ్లమే: ఇండియా ఛాంపియన్స్!

పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌తో ఏ స్థాయిలోనూ క్రికెట్ ఆడకూడదని టీమ్ఇండియా మాజీలు గట్టిగా చెప్పారు. అయితే, వరల్డ్ ఛాంపియన్ షిప్ లెజెండ్స్ టోర్నీలో పాక్‌తో రెండు మ్యాచుల్లో



తలపడే పరిస్థితి ఎదురైంది. ఒకటి లీగ్ స్టేజ్ లో కాగా.. రెండోది సెమీస్. ఇండియా ఛాంపియన్స్ మాత్రం నిస్సంకోచంగా పాక్‌తో మ్యాచ్‌లను రద్దు చేసుకుంది. భారత్ సెమీస్ ను బహిష్కరించడంతో పాక్ ఫైనల్ కు చేరుకుంది. ఈక్రమంలో తాము ఒకవేళ టైటిల్ పోరుకు అర్హత సాధించి అక్కడా పాక్ ప్రత్యర్థిగా వచ్చినా ఇదే నిర్ణయం తీసుకొనేవాళ్లమని ఇండియా ఛాంపియన్స్ ప్లేయర్లు పేర్కొన్నారు. ''మేం పాకిస్థాన్ తో ఆడటం లేదు. మాకు ఎప్పుడైనా సరే దేశం ముఖ్యం. నేషన్ కోసం ఇలాంటి నిర్ణయాలు తీసుకొనేందుకు సంకోచించం. భారత జట్టు సభ్యులుగా మేం ఎప్పుడూ గర్వపడుతూనే ఉంటాం. ఎలాంటి పరిస్థితుల్లోనూ మా దేశాన్ని ఎప్పటికీ నిరాశపరచం. మేం సెమీస్ కు చేరుకున్న తర్వాత మ్యాచ్ ను రద్దు చేసుకున్నాం. ఒకవేళ ఫైనల్ కు చేరి అక్కడా పాక్ ప్రత్యర్థిగా ఎదురైనా సరే ఇదే నిర్ణయానికి కట్టుబడి ఉంటాం. మేమంతా ఒకే మాటపై నిలబడతాం'' అని ఇండియా ఛాంపియన్స్ ఆటగాడొకరు తెలిపారు.

## 2028 ఒలింపిక్స్.. పాక్ క్రికెట్ జట్టుకు భారీ ఎదురుదెబ్బ



128 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఒలింపిక్స్ లోకి క్రికెట్ పునఃప్రవేశించనుంది. 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్ తో జెంటిల్మెన్ గేమ్ విశ్వక్రీడల్లోకి పునరాగమనం చేయనుంది. ఒలింపిక్స్ లో క్రికెట్ కు చివరి మరియు ఏకైక ప్రాతినిధ్యం 1900 పారిస్ ఒలింపిక్స్ లో దక్కింది.

నాడు గ్రేట్ బ్రిటన్, ఫ్రాన్స్ మాత్రమే పోటీలో పాల్గొన్నాయి. అప్పుడు ఇరు జట్ల మధ్య ఓ అనధికారిక టెస్ట్ మ్యాచ్ జరగగా.. అందులో గ్రేట్ బ్రిటన్ ఫ్రాన్స్ ను కేవలం రెండు రోజుల్లోనే ఓడించి స్వర్ణ పతకం కైవసం చేసుకుంది.

కాగా, రాబోయే ఒలింపిక్స్ లో పాల్గొనే జట్లపై ఐసీసీ తాజాగా ఓ కంక్లూజన్ కు వచ్చినట్లు తెలుస్తుంది. రీజియన్ల వారీగా టాప్ ర్యాంక్ జట్లను ఎంపిక చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

ఈ లెక్కన ఆసియా నుంచి భారత్, ఓషియానియా నుంచి ఆస్ట్రేలియా, ఆఫ్రికా నుంచి దక్షిణాఫ్రికా, యూరప్ నుంచి ఇంగ్లండ్, ఆతిథ్య దేశంగా అమెరికా క్వాలిఫై అయ్యే అవకాశముంది. ఆరో జట్టు ఎంపికపై క్లారిటీ లేదు. ఇదే జరిగితే పాకిస్థాన్, న్యూజిలాండ్, వెస్టిండీస్ జట్ల ఒలింపిక్స్ కల కలగానే మిగిలిపోయే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే, ఒలింపిక్స్ లో క్రికెట్ పోటీలు 2028 జులై 12 (ఒలింపిక్స్ ప్రారంభానికి రెండు రోజుల ముందు) నుంచి 29 వరకు జరుగనున్నాయి. అన్ని మ్యాచ్ లు లాస్ ఏంజెలెస్ కు 50 కిమీ దూరంలో ఉన్న పమోనాలోని ఫెయిర్ ప్లెక్స్ లో ప్రత్యేకంగా నిర్మించబడే 500 ఎకరాల తాత్కాలిక స్టేడియంలో జరుగుతాయి.

రాబోయే ఒలింపిక్స్ లో క్రికెట్ టీ20 ఫార్మాట్ లో జరుగనుంది. పురుషులు, మహిళల విభాగాల్లో మొత్తం ఆరు అంతర్జాతీయ జట్లు విశ్వవేదికపై పోటీ పడతాయి. గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ కోసం పోటీ జరుగుతుంది. మెడల్స్ మ్యాచ్ లు (సెమీఫైనల్స్ మరియు బ్రాంజ్, గోల్ మెడల్స్ మ్యాచ్ లు) జులై 20 (మహిళలు), 29 (పురుషులు) తేదీల్లో జరుగుతాయి.

జులై 14, 21 తేదీల్లో ఎలాంటి క్రికెట్ మ్యాచ్ లు లేవు. మ్యాచ్ జరిగిన ప్రతి రోజు రెండు మ్యాచ్ లు ఉంటాయి. ఈ మ్యాచ్ లు భారతకాలమానం ప్రకారం రాత్రి 9:30 గంటలకు, ఉదయం 7 గంటలకు మొదలవుతాయి.

## నంబర్ వన్ పదిలం

భారత ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకున్నాడు. ఇంగ్లాండ్‌తో నాలుగో టెస్టులో అజేయ సెంచరీతో అదరగొట్టిన జడేజా.. ఐసీసీ టెస్టు ఆల్ రౌండర్ల జాబితాలో నంబర్ వన్ ర్యాంకును నిలబెట్టుకున్నాడు. మరో సెంచరీ హీరో వాషింగ్టన్ సుందర్ 8 స్థానాలు మెరుగై 13వ ర్యాంకు సాధించాడు. బ్యాటింగ్ ర్యాంకింగ్స్ లో రిషబ్ పంత్ 7, యశస్వి జైశ్వాల్ 8, శుభ్ మన్ గిల్ 9వ స్థానాల్లో కొనసాగుతున్నారు. బౌలింగ్ లో జస్ ప్రీత్ బుమ్రా నంబర్ వన్ ర్యాంకును నిలబెట్టుకున్నాడు. రవీంద్ర జడేజా 14వ స్థానంలో ఉన్నాడు. టీ20 బ్యాటింగ్ లో అభిషేక్ శర్మ తన కెరీర్ లో తొలిసారిగా నంబర్ వన్ ర్యాంకు సాధించాడు. ట్రావిస్ హెడ్ (ఆస్ట్రేలియా) ఒక ర్యాంకు కోల్పోయి రెండో స్థానానికి పడిపోయాడు. తిలక్ వర్మ 3, సూర్యకుమార్ యాదవ్ 6, యశస్వి జైశ్వాల్ 11వ స్థానాల్లో ఉన్నారు.



## కష్ట కాలంలో నా వెంటే ఉన్నారాయన: సాయి దుర్గాతేజ్



కష్టకాలంలో దర్శకుడు దేవా కట్టా తన వెన్నంటే ఉన్నారని నటుడు సాయి దుర్గా తేజ్ అన్నారు. గురువారం నిర్వహించిన 'మయసభ' ట్రైలర్ విడుదల వేడుకలో దేవాతో ఉన్న అనుబంధాన్ని తేజ్ గుర్తుచేసుకున్నారు. ''దేవా కట్టాతో నాకు పదేళ్లుగా పరిచయం ఉంది. ఆయన తెరకెక్కించిన 'ఆటోనగర్ సూర్య' సినిమా నాపై ప్రభావం చూపింది. అప్పట్లో.. ఆ మూవీ టీజర్ చూసిన వెంటనే ఆయనకు ఫోన్ చేసి నన్ను నేను పరిచయం చేసుకున్నా. తర్వాత జిమ్ లో కలుసుకునేవాళ్లం. నాతో సినిమా చేయమని విజ్ఞప్తి చేసేవాడిని. అలా 2021లో మా కాంబినేషన్ లో 'రిపబ్లిక్' వచ్చింది. నా జీవితాన్ని మార్చేసిన ఘటన అదే సమయంలో జరిగింది (రోడ్డు ప్రమాదాన్ని ఉద్దేశించి). ఆ కష్టకాలంలో నా వెన్నంటే ఉన్న వ్యక్తి ఆయన. నేను కోరుకున్నట్టుగానే 'రిపబ్లిక్' క్లైమాక్స్ క్రియేట్ చేశారు. 'మయసభ' గురించి దేవా గతంలోనే చెప్పారు. నేను నటిస్తానంటే.. ఆడిషన్ ఇవ్వమన్నారు (నవ్వులు)''

''ఆది పినిశెట్టి నేను కలిసి డ్యాన్స్, కిక్ బాక్సింగ్ వంటివి ప్రాక్టీస్ చేసేవాళ్లం. నా లైఫ్ లో ఓ విలన్ ఉన్నాడు. అతడెవరో కాదు చైతన్యరావు. అతడు నటించిన '30 వెడ్స్ 21' వెబ్ సిరీస్ చూసిన మా అమ్మ నా పెళ్లి ప్రస్తావన తీసుకొచ్చింది. 'ఆ అబ్బాయి పెళ్లి చేసుకున్నాడు. నువ్వెందుకు చేసుకోవురా' అని అడిగింది. 'కంగారు పడకండి చేసుకుంటా అని చెప్పా'' సరదాగా పేర్కొన్నారు. ఆది పినిశెట్టి, చైతన్య రావు ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'మయసభ'. దేవా కట్టా, కిరణ్ జయ్ కుమార్ దర్శకత్వం వహించారు. ఇద్దరు స్నేహితులు.. రాజకీయ ప్రత్యర్థులుగా ఎలా మారారన్నది క్లుప్తంగా ఈ సినిమా కథాంశం. ఈ మూవీ నేరుగా ఓటీటీ 'సోనీలివ్' లో ఆగస్టు 7న విడుదల కానుంది. ఈ సినిమాని మూడు భాగాలుగా ప్లాన్ చేసినట్టు దేవా కట్టా తెలిపారు.



## వార్-2 నుంచి ఇంప్రెసివ్‌గా ఫస్ట్ సింగిల్!

బాలీవుడ్ స్టార్ నటుడు హృతిక్ రోషన్ టాలీవుడ్ నుంచి మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ ల కలయికలో దర్శకుడు అయాన్ ముఖర్జీ తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా యాక్షన్ చిత్రమే వార్ 2. మంచి హైప్ ఉన్న ఈ చిత్రం నుంచి మేకర్స్ ఎట్టకేలకి మొదటి పాటని విడుదల చేశారు. హృతిక్, కియారా లపై సాగే ఈ సాంగ్ ని నేడు కియారా బర్త్ డే ట్రీట్ గా విడుదల చేశారు. అయితే ఇది తన ఫ్యాన్స్ కి నిజంగానే ట్రీట్ అని చెప్పాలి. సాంగ్ వినేందుకు ఇంపుగా క్లీన్ మెలోడీ బీట్స్ తో ఉంటే హృతిక్, కియారాల కెమిస్ట్రీ కూడా సినిమాలో చాలా బాగా కనిపిస్తుంది. ఇక దీనితో పాటుగా మధ్యలో కియారా డామినేషన్ మాత్రం అదిరింది అని చెప్పాల్సిందే. ఆ మధ్య టీజర్ లో కియారా ఎలా అయితే ఒక స్ట్రజ్ ప్యాక్ గా నిలిచిందో అలానే ఈ సాంగ్ లో కూడా తన హాట్ షోతో అలరించింది అని చెప్పవచ్చు. మొత్తానికి మాత్రం వార్ 2 ఫ్యాన్స్ కి మంచి ట్రీట్ ని మేకర్స్ ఇపుడు వదిలారు.

## మృణాల్‌కు స్వీట్ సర్‌ప్రైజ్

'సీతారామం'తో తెలుగు ప్రేక్షకులను విశేషంగా అలరించిన నటి మృణాల్ ఠాకూర్. అప్పటి నుంచి టాలీవుడ్ వారికి ఫేవరెట్ హీరోయిన్ గా మారిపోయింది. వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఆమె ప్రస్తుతం అడివి శేష్ సరసన 'డెకాయిట్'లో నటిస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ టీమ్ ఆమెకు ఓ స్వీట్ సర్ ప్రైజ్ ఇచ్చింది. ఆగస్టు 1న మృణాల్ పుట్టినరోజు కావడంతో ఆమెకు ఈ మూవీ సెట్ లో ప్రీబర్త్డే సెలబ్రేషన్స్ చేశారు. ఆమెకు తెలియకుండా కేక్ తీసుకొచ్చి టీమ్ సభ్యులంతా తలుపు కొట్టి సర్ ప్రైజ్ చేశారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ గా మారింది. కేక్ కట్ చేసిన మృణాల్ టీమ్ తో కలిసి డ్యాన్స్ చేశారు. 'హ్యాపీ బర్త్డే సరస్వతి' అంటూ అందరూ విష్ చేయడంతో ఈ సినిమాలో ఆమె పాత్ర పేరు సరస్వతి అని తెలుస్తోంది.

షానీల్ డియో దర్శకత్వంలో 'డెకాయిట్... ఒక ప్రేమకథ' పేరుతో రానున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. వైవిధ్యమైన కథతో రూపొందుతున్న ఈ సినిమాలో బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంతో ఆయన టాలీవుడ్ కు ఎంట్రీ ఇస్తుండడం విశేషం. డిసెంబర్ 25న ఈ సినిమా విడుదల కానుంది.



## బాలయ్య, క్రిష్ ప్రాజెక్ట్‌పై ఇంట్రెస్టింగ్ టాక్!



నటసింహం నందమూరి బాలకృష్ణ హీరోగా ఇపుడు చేస్తున్న భారీ చిత్రం అఖండ 2 తాండవం కోసం అందరికీ తెలిసిందే. అయితే ఈ సినిమా తర్వాత బాలయ్య సాలిడ్ లైనప్ తో సిద్ధంగా ఉండగా ఈ చిత్రాల్లో విలక్షణ దర్శకుడు క్రిష్ జాగర్లమూడి కలయికలో మూడోసారి వర్క్ చేయనున్నారు అనే టాక్ కూడా వచ్చింది.

అయితే క్రిష్ తో గౌతమి పుత్ర శాతకర్ణి, ఎన్టీఆర్ బయోపిక్ తర్వాత హ్యాట్రిక్ సినిమా కోసం రెడి అవుతున్నారట. మరి ఈ సినిమా కోసం బాలయ్య మరోసారి డ్యూయల్ రోల్ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. బాలయ్య ఇపుడు వరకు ఎన్నో సినిమాలలో డ్యూయల్ రోల్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మళ్లీ రెండు పాత్రల్లో అలరించనున్నారట. మరి దీనిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది.

## ఓజీ ఫస్ట్ బ్లాస్ట్‌కు డేట్ ఫిక్స్.. ఫైర్ స్టార్మ్ వచ్చేస్తుంది..!




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ చిత్రం ఓజి కోసం ప్రేక్షకులు ఎంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారో అందరికీ తెలిసిందే. ఈ సినిమాను దర్శకుడు సుజిత్ డైరెక్ట్ చేస్తుండగా పూర్తి గ్యాంగ్ స్టర్ యాక్షన్ థ్రిల్లర్ గా ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర సెన్సేషన్ క్రియేట్ చేసేందుకు సిద్ధమవుతోంది. ఇక ఈ సినిమా నుంచి తాజాగా ఓ బ్లాస్టింగ్ అప్డేట్ అయితే మేకర్స్ ఇచ్చారు. ఓజి చిత్రం నుంచి ఫస్ట్ సింగిల్ సాంగ్ ను ఆగస్టు 2న రిలీజ్ చేస్తున్నట్లు వారు తాజాగా అనౌన్స్ చేశారు. పవన్ పవర్ ఫుల్ లుక్స్ తో డిజైన్ చేసిన ఈ అనౌన్స్ మెంట్ పోస్టర్ ప్రేక్షకులను ఇంప్రెస్ చేస్తోంది. ఇక ఈ సినిమాలోని ఫస్ట్ బ్లాస్ట్ ఎలాంటి విధ్వంసం సృష్టిస్తుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఈ సినిమాకు థమన్ సంగీతం మరో మేజర్ అట్రాక్షన్ కానుంది. ప్రియాంక మోహన్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మి విలన్ పాత్రలో నటిస్తున్నాడు. డివివి ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై డివివి దానయ్య ప్రొడ్యూస్ చేస్తున్న ఓజి చిత్రాన్ని సెప్టెంబర్ 25న వరల్ వైడ్ రిలీజ్ కు రెడీ చేస్తున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.